# పెన్ పవర్

12 YEARS PEN POWER JOURNEY 2014 - 2026 ప్రశ్నించడం మన హక్కు

విశాఖపట్నం | హైదరాబాద్ | ఉభయ గోదావరి | ఎన్. టి. ఆర్ | గుంటూరు | ప్రకాశం | నెల్లూరు | తిరుపతి | చిత్తూరు | కడప

తెలుగు దిన పత్రిక PEN POWER TELUGU DAILY ప్రశ్నించడం మన హక్కు

సంపుటి : 2 సంచిక : 29 పేజీలు :8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : ఒంగోలు ఆదివారం 4 అక్టోబర్ 2026 వెల : 1/-రూ ॥

VOLUME :2 ISSUE :29 PAGES :8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : ONGOLE SUN 4 OCTOBER 2026 PRICE : 1/- RS

Simultaneously Published form Ongole,Visakhapatnam,Kakinada,Bapatla,Narasarao Peta, YSR Kadapa,Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari,West Godavari,Eluru,Guntur,SPSR Nellore,Tirupati,Chittor,Kurnool,Anantapur




## లోక్‌సభ, అన్ని రాష్ట్రాల అసెంబ్లీలను తక్షణమే రద్దు చేయాలి

- దేశంలో జరిగినవన్నీ అక్రమ ఎన్నికలేనన్న ఖర్గే
- మోదీ, అమిత్ షాతో పాటు అందరూ అక్రమంగా పదవుల్లో ఉన్నారని వ్యాఖ్య
- ఈవీఎంల దుర్వినియోగం జరిగిందని ఆరోపణ

పెన్ పవర్ డెస్క్:కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కేంద్ర ప్రభుత్వంపై సంచలన ఆరోపణలు చేస్తూ, తీవ్రమైన డిమాండ్‌ను తెరపైకి తెచ్చారు. దేశంలో జరిగిన ఎన్నికలన్నీ అక్రమమని ఆరోపిస్తూ, లోక్‌సభతో పాటు అన్ని రాష్ట్రాల అసెంబ్లీలను తక్షణమే రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కర్ణాటకలోని కలబుర్గిలో

- మిగతా 2లో

# అంతా బాగుందనుకుంటే ప్రమాదమే..
## రానున్న ఆర్థిక సవాళ్లపై ఆర్‌బీఐ గవర్నర్ వార్నింగ్



- ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై ఒత్తిడి పెరుగుతోందన్న ఆర్‌బీఐ గవర్నర్
- ఆర్థిక ముప్పులపై ఎప్పుడూ అప్రమత్తంగా ఉండాలన్న మల్హోత్రా
- ప్రపంచ దేశాల మధ్య విభేదాలు పెరుగుతున్నాయని వెల్లడి
- వాణిజ్య ఆంక్షలు, సరఫరా సమస్యలు ప్రభావం చూపుతున్నాయని ప్రకటన
- ఆర్థిక సమస్యలు ఒక్కసారిగా బయటపడొచ్చని హెచ్చరిక

పెన్ పవర్ డెస్క్:ప్రపంచ ఆర్థిక వ్యవస్థ ప్రస్తుతం అనేక సవాళ్లను ఎదుర్కొంటోందని ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా అన్నారు. ప్రపంచ దేశాల మధ్య విభేదాలు, వాణిజ్య ఆంక్షలు, సరఫరా సమస్యలు, సాంకేతిక మార్పులు, వాతావరణ మార్పులు ఆర్థిక వ్యవస్థపై ప్రభావం చూపుతున్నాయని చెప్పారు. ఈ పరిస్థితుల్లో ఆర్థిక ముప్పుల విషయంలో ఎప్పుడూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

- మిగతా 2లో



## ఆ నీచులను వదిలిపెట్టను
### ఎన్టీఆర్ స్ట్రాంగ్ వార్నింగ్

పెన్ పవర్ డెస్క్: సామాజిక మాధ్యమాల్లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (AI) సాంకేతికతను ఉపయోగించి అసభ్యకర రీతిలో వీడియోలను క్రియేట్ చేయడంపై అగ్రకథానాయకుడు ఎన్టీఆర్ తీవ్ర ఆగ్రహం

- మిగతా 2లో

## యూపీలో కాంగ్రెస్‌కు 50 సీట్లు కూడా ఎక్కువే
### సమాజ్‌వాదీ ఎంపీ శివ్‌పాల్ సింగ్ పటేల్



- యూపీలో సీట్ల పంపకాలపై ఎస్పీ, కాంగ్రెస్ మధ్య రాజుకున్న వేడి
- ప్రస్తుతం కాంగ్రెస్‌కు ఇద్దరు ఎమ్మెల్యేలే ఉన్నారన్న ఎస్పీ ఎంపీ శివ్‌పాల్ సింగ్
- సీట్ల పంపకాలపై అక్టోబర్‌లో జరిగే చర్చల్లో అఖిలేశ్‌దే తుది నిర్ణయమని వెల్లడి
- పొత్తు వల్ల కాంగ్రెస్‌కే అధిక ప్రయోజనమని వ్యాఖ్య
- 150 సీట్లు కావాలంటూ ఇప్పటికే తమ మనోగతాన్ని బయటపెట్టిన కాంగ్రెస్

- మిగతా 2లో

## రైతులపై ప్రేమ ప్రచారానికే పరిమితం



పెన్ పవర్ డెస్క్:ఏపీలో గ్లోబల్ హార్టికల్చర్ హబ్ కు శంకుస్థాపన సందర్భంగా మదనపల్లి సభలో చంద్రబాబు చేసిన వ్యాఖ్యలకు ఎక్స్ వేదికగా కౌంటర్ ఇచ్చారు వైసీపీ అధినేత వైఎస్ జగన్. హార్టికల్చర్ పై చంద్రబాబు మాటలు డ్రామాలని..బడ్జెట్ కేటాయింపులు లేకుండా ఎలా ఖర్చు చేస్తారని ప్రశ్నించారు జగన్. రైతులపై చంద్రబాబు ప్రేమ

- మిగతా 2లో



## క్వ్యా-శివ, అమరావతి
# డిక్లరేషన్..
### పాన్ ఐఐటీ సమ్మిట్ లో కీలక ఘట్టాలను ఆవిష్కరించిన చంద్రబాబు

- విజయవాడలో పాన్ ఐఐటీ సమ్మిట్-2026
- హాజరైన సీఎం చంద్రబాబు
- డీప్‌టెక్ స్టార్టప్‌ల కోసం రూ.500 కోట్ల వెంచర్ ఫండ్ ఏర్పాటు
- అమరావతిలో శాశ్వత పాన్ ఐఐటీ కౌన్సిల్ ఏర్పాటుకు నిర్ణయం
- వచ్చే ఫిబ్రవరి నుంచి అమరావతిలో క్వాంటం కంప్యూటర్ ఆపరేషన్స్
- క్వాంటం వ్యాలీగా అమరావతిని తీర్చిదిద్దుతామన్న సీఎం చంద్రబాబు

పెన్ పవర్ డెస్క్:ఆంధ్రప్రదేశ్ భవిష్యత్తు సాంకేతిక ప్రగతికి, పెట్టుబడులకు కేంద్రంగా నిలవనుందనడానికి విజయవాడలో జరిగిన పాన్ ఐఐటీ అమరావతి సమ్మిట్ 2026 నిలువుటద్దం పట్టింది. ఈ సదస్సులో ముఖ్యమంత్రి చంద్రబాబు ఆధ్వర్యంలో రాష్ట్ర అభివృద్ధికి సంబంధించి

- మిగతా 2లో

# 3 లక్షల ఇళ్లకు శంకుస్థాపన..
## నేడు తెనాలికి సీఎం చంద్రబాబు, కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్

- పేదల కోసం మరో 3 లక్షల ఇళ్ల నిర్మాణానికి శ్రీకారం
- కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్‌తో కలిసి శంకుస్థాపన చేయనున్న సీఎం చంద్రబాబు
- దేశంలోనే తొలిసారిగా 3డీ కాంక్రీట్ ప్రింటింగ్ ఇళ్ల ప్రాజెక్టుకు భూమిపూజ
- గుంటూరు జిల్లా తెనాలి నియోజకవర్గంలో రేపు ఈ కార్యక్రమం
- గత 28 నెలల్లో ప్రభుత్వం 5.50 లక్షల ఇళ్లను లబ్ధిదారులకు అందించింది



పెన్ పవర్ డెస్క్:రాష్ట్రంలో పేదల సొంతింటి కలను సాకారం చేసే దిశగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మరో కీలక ముందడుగు వేస్తోంది. ప్రధాన మంత్రి ఆవాస్ యోజన-గ్రామీణ్ (PMAY-G) 2.0 పథకం కింద కేంద్ర ప్రభుత్వం కొత్తగా మంజూరు చేసిన మూడు లక్షల ఇళ్ల నిర్మాణానికి ముఖ్యమంత్రి చంద్రబాబు, కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌తో కలిసి (అక్టోబరు 4) భూమిపూజ చేయనున్నారు. గుంటూరు జిల్లా తెనాలి నియోజకవర్గంలోని బుర్రిపాలెం గ్రామంలో ఈ కార్యక్రమం జరగనుంది.కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఈ 28 నెలల కాలంలో ఇప్పటికే 5.50 లక్షల ఇళ్లను లబ్ధిదారులకు అందించింది. గతేడాది నవంబరులో 3 లక్షలు, ఈ ఏడాది మార్చిలో 2.50 లక్షల ఇళ్లకు సామూహిక గృహ ప్రవేశాలు నిర్వహించిన ప్రభుత్వం, ఇప్పుడు మరో భారీ కార్యక్రమానికి శ్రీకారం చుడుతోంది. రాష్ట్ర ప్రభుత్వ విజ్ఞప్తి మేరకు కేంద్రం ఇటీవలే ఈ 3 లక్షల ఇళ్లను కేటాయించింది. దీంతో ఏమాత్రం జాప్యం చేయకుండా నిర్మాణ పనులను ప్రారంభించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇదే సమయంలో, వచ్చే ఏడాది మార్చి నాటికి మరో 4.20 లక్షల ఇళ్ల నిర్మాణం పూర్తి చేసి లబ్ధిదారులకు అప్పగించాలని లక్ష్యంగా పెట్టుకుంది.

**దేశంలోనే తొలిసారిగా 3డీ ప్రింటింగ్ టెక్నాలజీ**

ఈ కార్యక్రమంతో పాటు, గృహ నిర్మాణ రంగంలో విప్లవాత్మక మార్పులకు నాంది పలుకుతూ దేశంలోనే తొలిసారిగా 3డీ కాంక్రీట్ ప్రింటింగ్ టెక్నాలజీతో ఇళ్ల నిర్మాణానికి సంబంధించిన పైలట్ ప్రాజెక్టుకు కూడా చంద్రబాబు, శివరాజ్ సింగ్ చౌహాన్ శంకుస్థాపన చేయనున్నారు. కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ, సీఎస్ఐఆర్-సీబీఆర్ఐ (రూర్కీ), ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సంయుక్తంగా

- మిగతా 2లో



## సుప్రీం తీర్పు తర్వాతే మున్సిపల్ ఎన్నికలు

- స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లపై సుప్రీంకోర్టుకు వెళ్లిన ఏపీ ప్రభుత్వం
- బీసీ రిజర్వేషన్లకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్న నారాయణ
- గత ప్రభుత్వం వల్లే అమరావతి అభివృద్ధి ఆగిపోయిందని విమర్శ

పెన్ పవర్ డెస్క్:స్థానిక సంస్థల ఎన్నికల్లో వెనుకబడిన తరగతులకు (బీసీ) 34 శాతం రిజర్వేషన్లు కల్పించే అంశంపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించడం తెలిసిందే. ఈ క్రమంలో

- మిగతా 2లో



## అమిత్ షా తెలంగాణ పర్యటన రద్దు..
### చివరి నిమిషంలో కీలక నిర్ణయం!

- తొలుత అక్టోబర్ 4న పర్యటనకు ఖరారైన షెడ్యూల్
- మెదక్, కరీంనగర్‌లో పర్యటనకు ఏర్పాట్లు పూర్తి
- షెడ్యూల్‌లో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు
- నిరాశలో బీజేపీ శ్రేణులు
- పర్యటనకు కారణాలు వెల్లడించని పార్టీ

పెన్ పవర్ డెస్క్: కేంద్ర హోంమంత్రి అమిత్ షా తెలంగాణ పర్యటన రద్దయింది. ఒక రోజు పర్యటన నిమిత్తం రేపు ఆయన రాష్ట్రానికి రావాల్సి ఉండగా.. చివరి నిమిషంలో కార్యక్రమాన్ని రద్దు చేసుకున్నారు. దానికి గల కారణాలేంటో అధికారికంగా

- మిగతా 2లో

## బీసీ రిజర్వేషన్లపై మాట్లాడే హక్కు వైసీపీకి లేదు

- బీసీలకు అధికారం దక్కకూడదని వైసీపీ కుట్ర చేసిందన్న రామ్మోహన్ నాయుడు
- రిజర్వేషన్ల కోసం కూటమి ప్రభుత్వం సుప్రీంకోర్టులో పోరాడుతోందని వెల్లడి
- టీడీపీకి బీసీలు వెన్నెముక వంటివారని వ్యాఖ్య

- మిగతా 2లో



## చంద్రబాబుకు ఇప్పుడు యంగ్ హార్డ్ వేర్ టీమ్ అండగా ఉంది



### పాన్ ఐఐటీ సమ్మిట్ లో మంత్రి లోకేశ్

- విజయవాడలో 'పాన్ ఐఐటీ సమ్మిట్ - 2026
- హాజరైన మంత్రి నారా లోకేశ్
- ఆంధ్రప్రదేశ్‌ను అభివృద్ధి చెందిన రాష్ట్రంగా మార్చడమే లక్ష్యమని ఉద్ఘాటన
- చంద్రబాబు అనుభవానికి యువ ఎమ్మెల్యేల బృందం తోడైందని వెల్లడి

- మిగతా 2లో

## ఎడిటర్ వ్యూ

## ఫ్లైట్‌లో దాడి ముందస్తు పథకమా ?

ఫ్లైదుబాయ్ విమానంలో భారతీయ పైలట్, కెప్టెన్ స్మిత్ మచ్చుర్‌పై దాడి జరగడం కలకలం రేపింది. అది కూడా కో పైలట్ ఈ పని చేయడం ప్రపంచాన్ని ఆశ్చర్యానికి గురిచేసింది. మచ్చుర్‌పై దాడికి యత్నించిన కో-పైలట్ హమామ్ అల్-హమామీకి సంబంధించి పలు కొత్త విషయాలు బయటకు వస్తున్నాయి. పలు నివేదికల ప్రకారం, అతడి పాత సోషల్ మీడియా అకౌంట్లు పరిశీలనలో అల్-ఖైదాతో సంబంధం ఉన్న వ్యక్తుల ఫోటోలు, ఇతర అనుమానాస్పద వ్యక్తులకు సంబంధించిన సమాచారం లభించాయి. యూఏఈ అటార్నీ జనరల్ ఈ ఘటనపై ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేశారు. ఉగ్రదాడి, హైజాక్ కోణంలో దర్యాప్తు చేస్తున్నారు. నివేదికల ప్రకారం, హమామ్ అల్-హమామీ ఒమన్‌కు చెందిన పౌరుడు. అతడు యూఏఈ లో జన్మించాడని కొన్ని నివేదికలు చెబుతుండగా.. అతని తండ్రి ఒమన్ పౌరుడని, తల్లి సిరియాకు చెందిన వ్యక్తి అని తెలిసింది. అతడు కొన్నేళ్లపాటు యూఏఈలో గడిపాడు. అతని పేరుతో ఉన్న లింక్డ్‌ఇన్ ప్రొఫైల్ ప్రకారం, ఒమన్ ఎయిర్‌లో దాదాపు ఏడేళ్లు పనిచేశాడు. ఆ తర్వాత రాయల్ ఎయిర్ మరోక్ తో అనుబంధం కలిగి ఉన్నాడు. ఆ తర్వాత ఫ్లైదుబాయ్‌లో కో-పైలట్‌గా చేరి సేవలు అందిస్తున్నాడు. 024లో నిందితుడు, కో పైలట్ హమామ్ అల్ హమామీని ఒమన్ ఎయిర్‌లో ఫ్లైట్ ట్రైనింగ్ నుంచి తప్పించారు. తీవ్రవాద భావజాలం వల్ల ఆకర్షితుడు అవుతున్నాడని అతడిపై అనుమానం వచ్చింది. దాంతో తలెత్తిన భద్రతా పరమైన ఆందోళనలే అతడ్ని తొలగించడానికి కారణమని సమాచారం. అతడిని ఎయిర్‌లైన్ నుంచి పూర్తిగా తొలగించకుండా ఇతర, నాన్-ఫ్లయింగ్ బాధ్యతలు అప్పగించారని కొన్ని నివేదికలు చెబుతున్నాయి. అయితే, ఆ సమయంలో అతని సమాచారాన్ని ఇతర ఎయిర్‌లైన్లు లేదా సంబంధిత దేశాల సంస్థలతో ఎంతవరకు పంచుకున్నారనే అంశంపై స్పష్టత లేదు. సీఎన్ఎన్ నివేదిక ప్రకారం, హమామ్‌కు సంబంధించిన సోషల్ అకౌంట్లలో కొన్ని అనుమానాస్పద ఫోటోలు, వీడియోలు లభించాయి. అందులో అల్-ఖైదాతో సంబంధం ఉన్న వ్యక్తులు కనిపిస్తున్నారు. ఒక వీడియోలో బోయింగ్ 737 మాక్స్ కాక్‌పిట్ నుంచి వేర్వేరు విమానాల రికార్డింగ్ కనిపిస్తుంది. వీడియో చివరలో అల్-ఖైదా మాజీ చీఫ్ ఐమన్ అల్-జవాహిరీ, 2009లో జఃఊ అధికారుల హత్యతో సంబంధం ఉన్న హుమామ్ ఖలీల్ అబూ-ములాల్ అల్-బలావీల ఫోటోలు ఉన్నాయని గుర్తించారు. ఈ పోస్టులపై కూడా దర్యాప్తు కొనసాగుతోంది. ఆ తర్వాత సోషల్ మీడియా ప్రొఫైళ్లు తొలగించారు. నివేదికల ప్రకారం, మరొక సోషల్ పోస్ట్‌లో ఏఐ సాయంతో తయారు చేసిన ఒక ఫొటో ఉంది. అందులో మక్కా, మదీనా, జెరూసలేంలను ఒక మెరుస్తున్న గీతతో కలిపాడు. దీంతో పాటు మరణం, అవమానానికి సంబంధించిన పదాలతో ఉన్న ఒక కవిత ఉన్నాయి. ఈ పోస్టులకు ప్రమాదంతో నేరుగా సంబంధం ఉందో లేదో దర్యాప్తులో తేలనుంది. సీఎన్ఎన్ నిపుణుల ప్రకారం, హమామ్ పాత, ఇప్పుడు తొలగించిన సోషల్ మీడియా పోస్టులలో మహిళల పట్ల కఠినమైన అభిప్రాయాలు ఉన్నాయి. పెళ్లి తర్వాత భార్య ఉద్యోగం చేయకూడదని, నిఖాబ్ ధరించాలని భావిస్తున్నట్లు పేర్కొన్నాడు. మరికొన్ని పోస్టులలో పురుషులు, మహిళలు కలసి పనిచేసే వర్క్ స్పేస్ లను పూర్తిగా వ్యతిరేకించాడు. సీఎన్ఎన్ 2021, 2022 నాటి దాదాపు 3,000 తొలగించిన పోస్టులను విశ్లేషించారు. ఈ పోస్టుల ద్వారా అతని వ్యక్తిగత, మతపరమైన ఆలోచనలు ఉన్నాయి. అయితే ఒక వ్యక్తి సోషల్ మీడియా ఆలోచనలకు, ఒక నేర సంఘటనకు నేరుగా లింక్ ఉందా లేదా అనే కోణాల్లోనూ దర్యాప్తు జరుగుతోంది. 30 సెప్టెంబర్ 2026న ఫ్లైదుబాయ్ విమానం ఖ్లీ1073 దుబాయ్ నుంచి టెల్ అవీవ్‌కు వెళ్తుండగా కాక్‌పిట్‌లో ఇద్దరు పైలట్ల మధ్య గొడవ జరిగింది. కో పైలట్ హమామ్ అల్ హమామీ దాడిలో భారత కెప్టెన్ స్మిత్ మచ్చుర్ గాయపడ్డారు. యూఏఈ అధికారిక సమాచారం ప్రకారం, ఈ ఘటన తర్వాత విమానాన్ని సౌదీ అరేబియాలోని తబుక్ ఎయిర్ పోర్ట్ వైపు మళ్లించి అక్కడ ల్యాండ్ చేశారు. ప్రయాణికులు, విమానంలో ఉన్న ఇతర క్రూ సభ్యులు పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. యూఏఈ జనరల్ సివిల్ ఏవియేషన్ అథారిటీ తరువాత కెప్టెన్ స్మిత్ మచ్చుర్ సురక్షితంగా యూఏఈకి తిరిగి రాగా, వైద్య చికిత్స కొనసాగుతోంది.

## లోక్‌సభ, అన్ని రాష్ట్రాల అసెంబ్లీలను తక్షణమే రద్దు చేయాలి

- మొదటి పేజీ తరువాయి

ఆయన మీడియాతో మాట్లాడుతూ, దేశంలో ప్రస్తుత పాలన మొత్తం చట్టవిరుద్ధమైన ఎన్నికల పునాదిపైనే నడుస్తోందని ఆరోపించారు. ఈవీఎంల దుర్వినియోగం, ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (సర్)లో జరుగుతున్న అవకతవకల కారణంగానే ఈ డిమాండ్ చేస్తున్నట్లు ఖర్గే స్పష్టం చేశారు. "ఈ రోజు దేశం మొత్తం అక్రమ ఎన్నికల ద్వారానే నడుస్తోంది. మోదీ అక్రమ ప్రధాని, అమిత్ షా అక్రమ మంత్రి అని, దేశంలో ఎన్నికైన ముఖ్యమంత్రులందరూ అక్రమంగా ఆ పదవుల్లో ఉన్నట్టేనని అన్నారు. వాటన్నింటినీ రద్దు చేసి, కేవలం బ్యాలెట్ పత్రాలతోనే మళ్లీ ఎన్నికలు నిర్వహించాలి" అని చెప్పారు.

ఈ అంశంపై కాంగ్రెస్ వర్కింగ్ కమిటీతో పాటు ఇండియా కూటమి భాగస్వామ్య పక్షాలతో కూడా చర్చించినట్లు ఖర్గే తెలిపారు. ఈ అక్రమాలకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా ఆందోళనలు చేపట్టాలని నిర్ణయించామని, అందులో భాగంగా అక్టోబర్ 6వ తేదీన ఢిల్లీలో విపక్ష ఎంపీలందరూ కలిసి ఎన్నికల సంఘం కార్యాలయానికి నిరసన ర్యాలీ నిర్వహిస్తారని వివరించారు. ఓటర్ల జాబితా నుంచి కొన్ని వర్గాల ప్రజల పేర్లను తొలగించే ప్రయత్నాలు జరుగుతున్నాయని, దీనిపై యువతలో చైతన్యం కల్పిస్తామని ఆయన పేర్కొన్నారు.

## ఆ నీచులను వదిలిపెట్టను

- మొదటి పేజీ తరువాయి

వ్యక్తం చేశారు. దేవర సినిమాలోని 'చుట్టమల్లే' పాట వీడియోను ఏఐతో మార్ఫింగ్ చేయడంపై ఆయన మండిపడ్డారు. మహిళలను పూజించే దేశంలో వారి గౌరవాన్ని దిగజార్చారంటూ ఎక్స్‌లో పోస్ట్ చేశారు. వారిని వదిలిపెట్టబోనని, బాధ్యులపై న్యాయపరమైన చర్యలు తీసుకుంటానని హెచ్చరించారు. "ఇది అత్యంత అసహ్యకరమైన చర్య. మహిళలను తల్లులుగా, దేవతలుగా పూజించే నేల మనది. 'మాతృదేవోభవ' అనే నినాదం మన సంస్కృతిలో భాగమైన చోట.. కొందరు వ్యక్తులు అత్యంత దిగజారి ప్రవర్తిస్తున్నారు. ఒక మహిళను అవమానించేలా ఏఐ సాంకేతికతను దుర్వినియోగం చేస్తూ ఇలాంటి నీచమైన కంటెంట్‌ను సృష్టించడం సిగ్గుచేటు. 'చుట్టమల్లే' పాట మార్ఫింగ్ వీడియో వెనుక ఉన్న నీచులు ఎవరినీ వదిలిపెట్టను" అని ఎన్టీఆర్ హెచ్చరించారు.

ఇక ఇలాంటి అసభ్యరమైన కంటెంట్‌ను ఎవరూ చూడొద్దని ఎన్టీఆర్ విజ్ఞప్తి చేశారు. "ఈరోజు వేరొక మహిళకు ఇలాంటి అవమానం జరిగింది. రేపు మీ ఇంట్లో మీ తల్లి, భార్య, కుమార్తెకూ ఇదే పరిస్థితి ఎదురవ్వొచ్చు. ఏఐ దుర్వినియోగాన్ని అరికట్టడానికి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవడానికి కేంద్రంతో పాటు అన్ని రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే కఠినమైన నిబంధనలు తీసుకురావాలని కోరుతున్నాను" అని ఎన్టీఆర్ పేర్కొన్నారు. ఏఐ మార్ఫింగ్ ఫొటోలు, వీడియోలు సెలబ్రిటీల పాలిట నరకంగా మారాయి. ఇటీవల 'అర్జున్ రెడ్డి' హీరోయిన్ శాలిని పాండే కూడా దీని బారిన పడ్డారు. ఆమెపై అసభ్యకర రీతిలో వీడియోలను రూపొందించగా అవి వైరల్ అయ్యాయి. దీనిపై ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. టెక్నాలజీని ఇలా ఉపయోగించడం సరికాదంటూ మండిపడ్డారు. ఆ వీడియో కనిపిస్తే ఎవరూ షేర్, డౌన్‌లోడ్ చేయొద్దని.. వెంటనే రిపోర్ట్ చేయాలని విజ్ఞప్తి చేశారు. గతంలో రష్మిక, కత్రినా కైఫ్, మృణాల్ ఠాకూర్, కీర్తి సురేశ్‌కు సంబంధించిన డీప్‌ఫేక్ వీడియోలు కూడా వైరలైన సంగతి తెలిసిందే.

## రైతులపై ప్రేమ ప్రచారానికే పరిమితం

- మొదటి పేజీ తరువాయి

ప్రచారానికే పరిమితమని.. చంద్రబాబు పాలనలో ధరల స్థిరీకరణ నిధి నిర్వీర్యమైందని అన్నారు జగన్. చంద్రబాబు అధికారంలోకి వచ్చాక ఉచిత పంటల బీమా, సున్నా వడ్డీ పథకం రద్దు చేశారని అన్నారు. రాయలసీమలో 7-8 లక్షల బోర్లు ఎండిపోయాయని.. రాయలసీమ లిఫ్ట్ ప్రాజెక్టుకు చంద్రబాబే అడ్డంకి అని అన్నారు జగన్. రైతుల కష్టాలను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. కరువు నివారణ చర్యలు వెంటనే చేపట్టాలని డిమాండ్ చేశారు జగన్. తీవ్రమైన కరువు కారణంగా రాయలసీమలో ఇప్పుడు తీవ్ర దుర్భిక్షం నెలకొంటే, వేలాది ఎకరాల్లో హార్టికల్చర్ తోటలు ఎండిపోతుంటే, మీరు వాటర్ మ్యాన్ అని బిల్డప్ ఇవ్వడం చూసి ప్రజలు నవ్వుకుంటున్నారని ఎద్దేవా చేశారు. ఇక హార్టికల్చర్ హబ్ సంగతి పక్కనపెడితే, రైతుల ఆత్మహత్యలకు చిరునామాగా రాయలసీమ సహా రాష్ట్రం మొత్తం తయారయ్యిందని... మీ డ్రామాలు, బిల్డప్‌లు కట్టిపెట్టి, రైతులకు ఊరటనిచ్చేలా తక్షణమే కరువు నివారణా చర్యలు మొదలుపెట్టండని ఎక్స్ వేదికగా ట్వీట్ చేశారు జగన్.

# క్యూ-శివ, అమరావతి డిక్లరేషన్..

- మొదటి పేజీ తరువాయి

పలు కీలక ఘట్టాలు ఆవిష్కృతమయ్యాయి. డీప్‌టెక్నాలజీ అభివృద్ధికి ఊతమిచ్చేలా రూ.500 కోట్ల వెంచర్ ఫండ్ ఏర్పాటు చేస్తూ చారిత్రక 'అమరావతి డిక్లరేషన్' విడుదల చేయడంతో పాటు, "మేకిన్ అమరావతి" సంకల్పంతో రూపొందించిన ఐదు "క్యూ-శివ" క్వాంటం కంప్యూటర్లను సీఎం ఆవిష్కరించారు. క్యూబిట్ ఫోర్స్ సంస్థ, చండీఘడ్ యూనివర్సిటీ సంయుక్తంగా అభివృద్ధి చేసిన ఈ క్యూ-శివ కంప్యూటర్లు మినీ టెస్టింగ్ క్వాంటం ల్యాబ్‌లుగా పనిచేస్తాయి. వీటితో పాటు 4 కెల్విన్ ప్రాసెసర్ 'సృష్టి'ని కూడా ముఖ్యమంత్రి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా క్యూబిట్ సంస్థ సీఈఓ వెంకటసుబ్రమణ్యం మాట్లాడుతూ.. ఈ కంప్యూటర్ల తయారీకి అవసరమైన కొన్ని కీలక కాంపోనెంట్లు ప్రపంచంలో ఒకటి రెండు చోట్ల మాత్రమే లభిస్తాయని, అలాంటివి మన మచిలీపట్నంలో దొరకడం విశేషమని తెలిపారు. తమ ప్రయత్నానికి సీఎం చంద్రబాబు అందించిన సహకారం మరువలేనిదని ఆయన పేర్కొన్నారు. అనంతరం క్యూబిట్ ప్రతినిధుల కృషిని అభినందించిన ముఖ్యమంత్రి, వారితో కలిసి సెల్ఫీ దిగి ఉత్సాహపరిచారు.

**అమరావతి డిక్లరేషన్.. డీప్‌టెక్‌కు ఊతం**

ఈ సదస్సులో ఏపీ ప్రభుత్వం, పాన్ ఐఐటీ అలుమ్ని ప్రతినిధులు సంతకాలు చేసిన 'అమరావతి డిక్లరేషన్' ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. దీని ప్రకారం, అమరావతిలో ఏపీ ప్రభుత్వం-పాన్ ఐఐటీ అలుమ్ని ఇండియా ఆధ్వర్యంలో ఒక శాశ్వత కౌన్సిల్ ఏర్పాటు కానుంది. డీప్‌టెక్ స్టార్టప్‌లు, ఆవిష్కరణలు, పెట్టుబడులను ప్రోత్సహించేందుకు రూ.500 కోట్ల పాన్ ఐఐటీ అమరావతి వెంచర్ ఫండ్‌ను ఏర్పాటు చేస్తున్నట్టు ప్రకటించారు. ఈ కౌన్సిల్ ద్వారా రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాలు, పరిశ్రమలు, స్టార్టప్‌లను సమన్వయం చేస్తారు. రాష్ట్రంలోని విద్యా సంస్థల్లో 10 ఇండస్ట్రీ చైర్స్ ఏర్పాటు చేయడం, 100 మంది గ్లోబల్ ఐఐటీ మెంటర్లతో స్టార్టప్‌లకు మార్గనిర్దేశం చేయడం, 23 ఐఐటీల నుంచి టెక్నాలజీ ట్రాన్స్‌ఫర్ వంటివి ఈ డిక్లరేషన్‌లోని ముఖ్యాంశాలు. క్వాంటమ్-ఏఐ, సెమీకండక్టర్లు, స్పేస్-డిఫెన్స్ వంటి రంగాల్లో పెట్టుబడులను ఆకర్షించి, 2030 నాటికి కనీసం 50 స్టార్టప్‌లను ఇంక్యుబేట్ చేయాలనే లక్ష్యాన్ని నిర్దేశించారు.

**క్వాంటం వ్యాలీగా అమరావతి: సీఎం చంద్రబాబు**

ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ.. "గతంలో ఐటీని ప్రోత్సహిస్తే ప్రపంచవ్యాప్తంగా మన తెలుగువారు నిపుణులుగా ఎదిగారు. ఇప్పుడిక సిలికాన్ వ్యాలీ గురించి కాదు, అమరావతిలోని క్వాంటం వ్యాలీ గురించి ప్రపంచం చర్చించుకుంటుంది" అని ధీమా వ్యక్తం చేశారు. గతంలో తాను విజన్ 2020 తీసుకువచ్చినప్పుడు కొందరు '420' అంటూ హేళన చేశారని, కానీ దాని ద్వారానే విద్యుత్, రహదారుల వంటి రంగాల్లో సంస్కరణలు వచ్చాయని గుర్తుచేశారు. ప్రధాని మోదీ నాయకత్వంలో దేశం అభివృద్ధి పథంలో పయనిస్తోందని, 2047 నాటికి భారత్ ప్రపంచంలోనే అగ్రగామి ఆర్థిక వ్యవస్థగా ఎదగడాన్ని ఎవరూ ఆపలేరని అన్నారు. జాతి నిర్మాణంలో భాగమైన ఐఐటీయన్లు వికసిత్ భారత్, స్వర్ణాంధ్ర లక్ష్యాల సాధనకు సహకరించాలని పిలుపునిచ్చారు. ఐబీఎం-టీసీఎస్, ఎల్ అండ్ టీ సంయుక్తంగా ఏర్పాటు చేయనున్న క్వాంటం కంప్యూటర్ ఆపరేషన్స్ వచ్చే ఏడాది ఫిబ్రవరి నుంచి అమరావతి నుంచే ప్రారంభమవుతాయని చంద్రబాబు ప్రకటించారు. భవిష్యత్తులో కేవలం వినియోగించుకోవడమే కాకుండా, క్వాంటం కంప్యూటర్లను తయారు చేసి ఎగుమతి చేసే స్థాయికి ఆంధ్రప్రదేశ్ చేరుకుంటుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

# చంద్రబాబుకు ఇప్పుడు యంగ్ హార్డ్‌వేర్ టీమ్ అండగా ఉంది

ముఖ్యమంత్రి చంద్రబాబు అనుభవం అనే బలమైన సాఫ్ట్‌వేర్‌కు, యువతతో నిండిన చురుకైన హార్డ్‌వేర్ టీమ్ ఇప్పుడు అండగా నిలిచిందని, ఈ అరుదైన కలయికతో ఆంధ్రప్రదేశ్‌ను దేశంలోనే నంబర్ వన్ రాష్ట్రంగా తీర్చిదిద్దుతామని రాష్ట్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ స్పష్టం చేశారు. విజయవాడలో జరిగిన 'పాన్ ఐఐటీ సమ్మిట్ - 2026'లో ఆయన మాట్లాడుతూ.. ప్రధాని మోదీ 'వికసిత్ భారత్' లక్ష్యానికి తమ వంతు సహకారం అందిస్తామని, అభివృద్ధి చెందిన రాష్ట్రంగా ఏపీని మార్చడమే తమ ఉమ్మడి లక్ష్యమని అన్నారు.

"ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రస్తుతం 4.0 ఆపరేటింగ్ సిస్టమ్‌తో మరింత ఉత్సాహంగా పనిచేస్తున్నారు. ఆయనకు ఇప్పుడు ఒక యంగ్ హార్డ్‌వేర్ టీమ్ అండగా ఉంది. మా శాసనసభ్యుల్లో 50 శాతం మంది మొదటిసారి గెలిచినవారే. 25 మంది మంత్రులలో 17 మంది తొలిసారి మంత్రులయ్యారు. అనుభవజ్ఞమైన సాఫ్ట్‌వేర్‌కు, ఈ యువ, డైనమిక్ హార్డ్‌వేర్ కలయికే నేటి ఆంధ్రప్రదేశ్‌ను ప్రత్యేకంగా నిలబెడుతోంది. ఏ రంగంలోనైనా ఆంధ్రప్రదేశ్ నంబర్ వన్‌గా ఉండాలన్నదే మా స్పష్టమైన విజన్" అని లోకేశ్ వివరించారు. 5 లక్షల మందికి పైగా ఐఐటీ గ్రాడ్యుయేట్లను కలిపే పాన్ ఐఐటీ సదస్సు ఏపీలో జరగడం ఆనందంగా ఉందన్నారు.

**అభివృద్ధికి '3ూ' మంత్రం**

అభివృద్ధి చెందిన దేశంగా మారడానికి భారత్‌కు ఒక దశాబ్దం చాలని, ఆ స్వర్ణ దశాబ్దం మనదే కావాలని ఆకాంక్షించిన లోకేశ్, దీనికి తమ ప్రభుత్వం '3ూ' మంత్రాన్ని అనుసరిస్తోందని తెలిపారు. "మొదటిది స్పీడ్ (వేగం), రెండోది సర్వీస్ (సేవ), మూడోది స్టెబిలిటీ (స్థిరత్వం). ప్రజలు మాకు ఇచ్చింది ఐదేళ్ల సమయం. ఈ సమయంలోనే ఫలితాలు చూపించాలి. కేవలం ఎంఓయూలు కుదుర్చుకుని వాటిని మర్చిపోయే రకం మాది కాదు. ప్రాజెక్టులకు వాస్తవ రూపమిచ్చి ఉద్యోగాలు సృష్టించాలన్న తపన మాది. పరిశ్రమదారులను మేము 'జాతి నిర్మాణకర్తలు'గా భావిస్తున్నాం. వారితో కలిసి పనిచేస్తూ, ప్రపంచ స్థాయి పాలన అందించడమే మా సేవా దృక్పథం. ఇక మూడోది స్థిరత్వం. మా పాలసీలు కాలపరీక్షను, రాజకీయ మార్పులను తట్టుకుని నిలబడేలా ఉంటాయి" అని ఆయన అన్నారు. ఇందుకు ఉదాహరణగా, గత కేసులన్నింటినీ AI ద్వారా విశ్లేషించి, న్యాయపరమైన చిక్కులు రాకుండా 16,000 ఉపాధ్యాయుల నియామక ప్రక్రియను చేపట్టామని గుర్తుచేశారు.

**అమలుపైనే దృష్టి.. ఇవే మా నిదర్శనాలు**

కేవలం కాగితాలపై హామీలు కాకుండా, వాస్తవంగా అమలవుతున్న ప్రాజెక్టుల గురించి లోకేశ్ సవివరంగా మాట్లాడారు. "ఏపీలో నమో అంటే నాయుడు జీ, మోదీజీ జోడీ. డబుల్ ఇంజిన్ బుల్లెట్ ట్రైన్ ప్రభుత్వం ఉండటం వల్లే పనులు వేగంగా జరుగుతున్నాయి. ఏపీని గ్లోబల్ హార్టికల్చర్ హబ్‌గా మార్చాలన్న సీఎం సంకల్పంతో రిలయెన్స్ భాగస్వామ్యంతో మదనపల్లెలో 'ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్'కు శంకుస్థాపన చేశాం. ఇది లక్ష కోట్ల పెట్టుబడులను ఆకర్షిస్తుంది" అని తెలిపారు.

"ఇతర రాష్ట్రాల్లో దశాబ్దాలుగా నిలిచిపోయిన ఆర్సెలర్ మిట్టల్ స్టీల్ ప్లాంట్ ప్రాజెక్టుకు కేవలం 17 నెలల్లోనే పునాది వేశాం. విశాఖపట్నంలో గూగుల్ డేటా సెంటర్ కోసం కేంద్ర ప్రభుత్వంతో సమన్వయం చేసుకుని 13 నెలల్లోనే అనుమతులు సాధించి పనులు ప్రారంభించాం. దేశంలో ఎవరూ ఊహించని ధరకు స్పేస్ టెక్ స్టార్టప్ స్కైరూట్‌కు 300 ఎకరాలు కేటాయించాం. మారిటైమ్ డ్రోన్లు తయారుచేసే సాగర్ డిఫెన్స్ సంస్థకు ఫిషింగ్ హార్బర్‌లో స్థలం ఇవ్వగా, 18 నెలల్లో ఆ సంస్థ విలువ రూ.3,000 కోట్ల నుంచి రూ.23,000 కోట్లకు పెరిగింది. ఇదే మా ప్రభుత్వ నిబద్ధతకు నిదర్శనం" అని లోకేశ్ పేర్కొన్నారు.

**23 క్లస్టర్ల ఏర్పాటు.. అమరావతిపై ప్రత్యేక దృష్టి**

రాష్ట్రంలో హార్టికల్చర్ నుంచి క్వాంటం కంప్యూటింగ్ వరకు 23 పారిశ్రామిక క్లస్టర్లను ఏర్పాటు చేస్తున్నామని, రెన్యువబుల్ ఎనర్జీలో ఏడాదిలోనే 4.8 గిగావాట్ల సామర్థ్యాన్ని జోడించామని లోకేశ్ వెల్లడించారు. అమరావతి నిర్మాణంపై మాట్లాడుతూ, "మీరు అమరావతికి వస్తే, నిర్మాణంలో ఉన్న ఒక ఆధునిక నగరం కనిపిస్తుంది. ప్రపంచ ప్రఖ్యాత ఆర్కిటెక్ట్ నార్మన్ ఫాస్టర్ డిజైన్లతో అసెంబ్లీ, సచివాలయం వంటివి నిర్మిస్తున్నాం. ఇక్కడ 5,000 ఎకరాల్లో గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్ట్ నిర్మించబోతున్నాం. హైదరాబాద్ అభివృద్ధిలో శంషాబాద్ విమానాశ్రయం పోషించిన పాత్రను ఇది పోషిస్తుంది" అని అన్నారు.

**ఐఐటీయన్లకు రెండు విజ్ఞప్తులు**

ఈ సందర్భంగా పాన్ ఐఐటీ కమ్యూనిటీకి లోకేశ్ రెండు విజ్ఞప్తులు చేశారు. "మొదటిది, ప్రపంచాన్ని జయించిన మీ గ్రాడ్యుయేట్ల పరిజ్ఞానాన్ని, మార్గదర్శకత్వాన్ని మా 23 క్లస్టర్ల అభివృద్ధికి అందించాలి. రెండోది, 'జుగాడ్' మోడల్ నుంచి 'వ్యవస్థీకృత వేగం' వైపు ఏపీ ప్రయాణించడానికి, ఏఐ సాయంతో మెరుగైన పాలన అందించడానికి మీరంతా సహకరించాలి. ఇతర దేశాల మోడళ్ల గురించి మాట్లాడటం కాదు, భారత్ ఏం చేయగలదో ప్రపంచానికి చూపించాలి. అందుకు ఆంధ్రప్రదేశ్‌ను ఒక ఆదర్శంగా నిలపాలనుకుంటున్నాం" అని లోకేశ్ తన ప్రసంగాన్ని ముగించారు.

# సుప్రీం తీర్పు తర్వాతే మున్సిపల్ ఎన్నికలు

- మొదటి పేజీ తరువాయి

రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి నారాయణ స్పందించారు. అమరావతిలో ఈరోజు ఆయన మాట్లాడుతూ, బీసీలకు రిజర్వేషన్లు అమలు చేసేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని, సుప్రీంకోర్టు తీర్పు వెలువడిన తర్వాతే 123 మున్సిపాలిటీలకు ఎన్నికలు నిర్వహిస్తామని స్పష్టం చేశారు. రాబోయే గోదావరి పుష్కరాలను అత్యంత వైభవంగా నిర్వహించేందుకు ప్రభుత్వం సిద్ధమవుతోందని మంత్రి నారాయణ వివరించారు. ఇందుకోసం సుమారు రూ.2,000 కోట్లు కేటాయించామని, ఇందులో ఒక్క రాజమండ్రి అభివృద్ధి పనులకే రూ.1,000 కోట్లు కేటాయించినట్లు పేర్కొన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి సవాలుగా ఉన్నప్పటికీ, పుష్కరాల నిర్వహణకు నిధుల కొరత లేకుండా చూస్తామని హామీ ఇచ్చారు. గతంలో జల్ జీవన్ మిషన్ కింద మంజూరైన రూ.5,350 కోట్ల నిధులు వినియోగించుకోకపోవడంతో నిలిచిపోయిన ప్రాజెక్టులను కేంద్రం సహకారంతో పునరుద్ధరిస్తామని తెలిపారు. అమరావతి అభివృద్ధి పనుల గురించి ప్రస్తావిస్తూ, ప్రపంచంలోని ఐదు ఉత్తమ రాజధానుల్లో ఒకటిగా తీర్చిదిద్దే లక్ష్యంతో పనులు ప్రారంభమయ్యాయని అన్నారు. గత ప్రభుత్వం అమరావతి అభివృద్ధిని పూర్తిగా నిర్వీర్యం చేసిందని విమర్శించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలో 2028 చివరి నాటికి నిర్మాణ పనులు పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. 2027లో 12 రోజుల పాటు జరగనున్న గోదావరి పుష్కరాలకు లక్షలాదిగా భక్తులు వస్తారని అంచనా వేస్తున్న నేపథ్యంలో రోడ్లు, ఘాట్లు, విద్యుత్ సరఫరా వంటి మౌలిక వసతుల పనులను వివిధ శాఖలు సమన్వయంతో చేపడుతున్నాయి.

## అమిత్ షా తెలంగాణ పర్యటన రద్దు..

- మొదటి పేజీ తరువాయి

వెల్లడికాలేదు. షెడ్యూల్ ప్రకారం అమిత్ షా నేటి రాత్రి 9 గంటలకు ప్రత్యేక విమానంలో హైదరాబాద్‌లోని బేగంపేట విమానాశ్రయానికి చేరుకుని, లోక్‌భవన్‌లో బస చేయాల్సి ఉంది. ఆదివారం ఉదయం మెదక్, కరీంనగర్ జిల్లాల్లో ఆయన పర్యటిస్తారని.. పలు అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేయడంతో పాటు ఇతర కార్యక్రమాల్లో పాల్గొంటారని షెడ్యూల్ లో పేర్కొన్నారు. హోంమంత్రి పర్యటన కోసం మెదక్, కరీంనగర్ జిల్లాల యంత్రాంగం ఇప్పటికే ఏర్పాట్లు పూర్తి చేసింది. పోలీసులు కూడా భారీ భద్రతా ఏర్పాట్లు చేశారు. అయితే పర్యటన రద్దుకు గల కారణం మాత్రం ఇంకా స్పష్టంగా తెలియలేదు. ఢిల్లీలో అత్యవసర పరిణామాలు లేదా ఇతర అనివార్య కారణాల వల్లే పర్యటన రద్దయి ఉండొచ్చని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. పర్యటన రద్దుతో బీజేపీ శ్రేణుల్లో నిరాశ నెలకొంది. అమిత్ షా తెలంగాణకు ఎప్పుడు వస్తారనే విషయాన్ని త్వరలో అధికారికంగా ప్రకటించే అవకాశం ఉంది.

## బీసీ రిజర్వేషన్లపై మాట్లాడే హక్కు వైసీపీకి లేదు

వైసీపీపై కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. బీసీ రిజర్వేషన్ల అంశంపై మాట్లాడే నైతిక హక్కు వైసీపీకి లేదని ఆయన ధ్వజమెత్తారు. శ్రీకాకుళం జిల్లా పాతపట్నం నియోజకవర్గంలో ఎమ్మెల్యే గోవిందరావుతో కలిసి 'పల్లె పండుగ 3.0' కార్యక్రమంలో పాల్గొన్న ఆయన, పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా రామ్మోహన్ నాయుడు మాట్లాడుతూ... బీసీలకు రాజ్యాధికారం దక్కకూడదనే ఉద్దేశంతోనే గతంలో వైసీపీ ప్రభుత్వం రిజర్వేషన్లను అడ్డుకుందని ఆరోపించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ కోటాపై గతంలో కోర్టు తీర్పు ఇస్తే, దానిపై అప్పటి జగన్ ప్రభుత్వం ఎందుకు పోరాడలేదని ఆయన ప్రశ్నించారు. బీసీలకు వైసీపీ తీవ్ర అన్యాయం చేసిందని మండిపడ్డారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్ల అమలు కోసం సుప్రీంకోర్టులో పోరాటం చేస్తోందని తెలిపారు. గతంలో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పించిందే తెలుగుదేశం పార్టీ అని గుర్తుచేశారు. బీసీలు ఉన్నత స్థాయిలో ఉండాలన్నదే టీడీపీ లక్ష్యమని స్పష్టం చేశారు. టీడీపీకి బీసీలే వెన్నెముక అని, తమది బీసీల పార్టీ అని అన్నారు. జగన్ అండ్ కో ఆటలు ఇకపై చెల్లవని హెచ్చరించారు.

## 3 లక్షల ఇళ్లకు శంకుస్థాపన..

- మొదటి పేజీ తరువాయి

ఈ ప్రాజెక్టును చేపడుతున్నాయి. పైలట్ ప్రాజెక్టు కింద తెనాలి నియోజకవర్గంలోని బుర్రిపాలెం, ఓబులనాయుడు పాలెం గ్రామాల్లో రూ.14 కోట్ల అంచనా వ్యయంతో 177 ఇళ్లను నిర్మించనున్నారు. ఈ అత్యాధునిక టెక్నాలజీ ద్వారా అత్యంత వేగంగా, తక్కువ శ్రమతో నిర్మాణం పూర్తి చేయడం, నిర్మాణ వ్యర్థాలను తగ్గించడం, నాణ్యత, పటిష్ఠతను పెంచడం సాధ్యమవుతుందని అధికారులు వివరిస్తున్నారు.

**ముఖ్యమంత్రి పర్యటన వివరాలు**

సీఎం చంద్రబాబు ఆదివారం ఉదయం 10:15 గంటలకు ఉండవల్లిలోని క్యాంపు కార్యాలయం నుంచి బయలుదేరి 10:35 గంటలకు బుర్రిపాలెం చేరుకుంటారు. ఉదయం 10:40 గంటలకు 3డీ ఇళ్ల నిర్మాణ పైలట్ ప్రాజెక్టుకు భూమిపూజ చేసి, అనంతరం లబ్ధిదారులతో సమావేశమవుతారు. 11:10 గంటలకు అక్కడ ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ప్రసంగిస్తారు. పర్యటన ముగించుకుని మధ్యాహ్నం 1:35 గంటలకు తిరిగి క్యాంపు కార్యాలయానికి చేరుకుంటారు.

# యూపీలో కాంగ్రెస్‌కు 50 సీట్లు కూడా ఎక్కువే

ఉత్తర్‌ప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికలకు ముందే సమాజ్‌వాదీ పార్టీ (ఎస్పీ), కాంగ్రెస్ మధ్య సీట్ల పంపకంపై మాటల యుద్ధం మొదలైంది. కాంగ్రెస్ కనీసం 150 స్థానాల్లో పోటీ చేయాలని చెబుతుండగా.. 50 సీట్లు కూడా ఎక్కువేనని ఎస్పీ ఎంపీ శివ్‌పాల్ సింగ్ పటేల్ అన్నారు. కాంగ్రెస్ తన బలాన్ని బట్టి సీట్లు కోరాలని సూచించారు. కాంగ్రెస్‌కు 50 సీట్లు ఇస్తేనే పెద్ద విషయమని పటేల్ వ్యాఖ్యానించారు. ప్రస్తుతం ఉత్తర్‌ప్రదేశ్‌లో కాంగ్రెస్‌కు ఇద్దరు ఎమ్మెల్యేలు మాత్రమే ఉన్నారని గుర్తు చేశారు. రెండు పార్టీలు కలిసి పోటీ చేస్తే కాంగ్రెస్‌కు ప్రయోజనం ఉంటుందని అన్నారు. కాంగ్రెస్ మాత్రం 150 సీట్లకు తగ్గకుండా పోటీ చేయాలని ఇప్పటికే తన వైఖరిని స్పష్టం చేసింది. యూపీ కాంగ్రెస్ ఇన్‌ఛార్జి రాజేంద్ర పాల్ గౌతమ్ ఈ విషయాన్ని ఇటీవల ప్రకటించారు. 403 అసెంబ్లీ స్థానాల్లో సగం సీట్లపై తమకు హక్కు ఉందని ఆయన పేర్కొన్నారు. సీట్ల పంపకంపై

చర్చలు అక్టోబర్‌లో జరిగే అవకాశం ఉంది. సీట్ల విషయంలో ఏకాభిప్రాయం కుదరకపోతే పొత్తు ఉద్దేశమే దెబ్బతింటుందని పటేల్ అన్నారు. తుది నిర్ణయం ఎస్పీ అధ్యక్షుడు అఖిలేశ్ యాదవ్ తీసుకుంటారని చెప్పారు. కాంగ్రెస్ ఎంపీ ఇమ్రాన్ మసూద్ మాత్రం తమ పార్టీ నాయకత్వం తీసుకునే నిర్ణయానికే కట్టుబడి ఉంటామని తెలిపారు. ఎస్పీ, కాంగ్రెస్ 2024 లోక్‌సభ ఎన్నికల్లో యూపీలో కలిసి పోటీ చేశాయి. ఆ ఎన్నికల్లో ఎస్పీ 37, కాంగ్రెస్ 6 లోక్‌సభ స్థానాలు గెలిచాయి.

# అంతా బాగుందనుకుంటే ప్రమాదమే..

## రానున్న ఆర్థిక సవాళ్లపై ఆర్‌బీఐ గవర్నర్ వార్నింగ్

- మొదటి పేజీ తరువాయి

కోవిడ్ తర్వాత ప్రపంచం ఎన్నో ఆర్థిక, ఇతర సంక్షోభాలను ఎదుర్కొందని మల్హోత్రా తెలిపారు. అయినా ప్రపంచ ఆర్థిక వ్యవస్థ వాటిని తట్టుకుని నిలబడిందన్నారు. భారత్‌లోనూ చాలాకాలంగా ఆర్థిక పరిస్థితులు స్థిరంగా ఉన్నాయని చెప్పారు.

అయితే ఇదే స్థిరత్వం మరో సమస్యకు దారి తీయొచ్చని ఆయన హెచ్చరించారు. చాలాకాలం ఎలాంటి పెద్ద సంక్షోభం రాకపోతే గతంలో ఎదురైన సమస్యలను ప్రజలు, సంస్థలు మర్చిపోతారని అన్నారు. దీంతో ఎక్కువ రిస్క్ తీసుకోవడం, భారీగా అప్పులు చేయడం పెరిగే అవకాశం ఉందని చెప్పారు.

**ఒక్కసారిగా సమస్యలు రావొచ్చు**

బ్యాంకింగ్, ఆర్థిక రంగాల్లో సమస్యలు ఒక్కసారిగా బయటపడే అవకాశం ఉందని మల్హోత్రా తెలిపారు. అయితే వాటిని పూర్తిగా పరిష్కరించడానికి మాత్రం చాలా సమయం పడుతుందని చెప్పారు. అందుకే పరిస్థితులు బాగున్న సమయంలోనే జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ప్రపంచ ఆర్థిక వ్యవస్థను గతంలో నడిపించిన విధానాల్లో ఇప్పుడు మార్పులు వస్తున్నాయని ఆయన పేర్కొన్నారు. దేశాల మధ్య రాజకీయ, ఆర్థిక విభేదాలు పెరుగుతున్నాయని చెప్పారు. వాణిజ్య ఆంక్షలు, సరఫరా అంతరాయాలు కూడా తరచూ ఎదురవుతున్నాయని తెలిపారు. ఈ మార్పులన్నీ ఒకదానితో ఒకటి కలిసి ప్రభావం చూపుతున్నాయని మల్హోత్రా అన్నారు. అందువల్ల కేంద్ర బ్యాంకులు కేవలం ద్రవ్యోల్బణం, ఆర్థిక స్థిరత్వంపైనే దృష్టి పెట్టకుండా ప్రపంచ పరిణామాలను కూడా గమనించాలని సూచించారు.




# జెడ్పీ పీఠాలపై ఉత్కంఠ..

# మార్కాపురంకు బిసి కి ఛాన్స్..?

**ప్రకాశం జిల్లాకు మళ్లీ ఓసి వచ్చే అవకాశం ఉన్నట్లు ప్రచారం**

**మార్కాపురం తొలి పీఠం బీసీలకు దక్కే అవకాశం ఉన్నట్లు సమాచారం**

**21 మండలాల్లో బీసీ జనాభా ఎక్కువ - గణాంకాలు అనుకూలం**

**అధికారిక నోటిఫికేషన్ కోసం ఉత్కంఠగా ఎదురుచూస్తున్న నేతలు**

**మార్కాపురం (స్టాఫ్ రిపోర్టర్ )పెన్ పవర్ అక్టోబర్ 03**

రాష్ట్రంలో జిల్లా పరిషత్ చైర్మన్ పీఠాల రిజర్వేషన్లపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. ఉమ్మడి ప్రకాశం జిల్లా విడిపోయి ప్రకాశం, మార్కాపురం జిల్లాలుగా ఏర్పడిన తర్వాత తొలిసారి జరగబోయే జెడ్పీ ఎన్నికలపై అన్ని పార్టీల్లో ఆసక్తి నెలకొంది. కొత్త జిల్లాగా ఏర్పడిన మార్కాపురంలో తొలి జెడ్పీ పీఠం ఎవరికి దక్కుతుందా అని అన్ని వర్గాల్లో ఉత్కంఠ మొదలైంది. ప్రస్తుతం అమరావతిలో రిజర్వేషన్లపై కసరత్తు జరుగుతున్నట్లు తెలిసిన సమాచారం. ఈ నేపథ్యంలో ఏ జిల్లాకు ఏ కేటగిరీ వస్తుందనేది ఇప్పుడు రాష్ట్ర వ్యాప్తంగా హాట్ టాపిక్ గా మారింది.

**మొన్నటి వరకు ఉమ్మడి పీఠంపై బూచేపల్లి వెంకాయమ్మ..**

ఉమ్మడి ప్రకాశం జిల్లా జెడ్పీ చైర్మన్ గా మొన్నటి వరకు బూచేపల్లి వెంకాయమ్మ కొనసాగారు. ఆమె పదవీకాలం ముగియడంతో ప్రస్తుతం ఆ పీఠం ఖాళీగా ఉంది. కొత్త నోటిఫికేషన్ లో ప్రకాశం జిల్లా పీఠం ఏ కేటగిరీకి వెళ్తుందనే దానిపై అందరి దృష్టి పడింది.

**ప్రకాశంకు ఇప్పుడు కూడా ఓసీ వచ్చే అవకాశం ఉన్నట్లు ప్రచారం..**

అందుతున్న సమాచారం మేరకు, విశ్వసనీయ వర్గాల నుంచి తెలిసిన వివరాల ప్రకారం ప్రకాశం జిల్లా జెడ్పీ పీఠానికి ఇప్పుడు కూడా ఓసి (జనరల్) వచ్చే అవకాశాలు కనిపిస్తున్నట్లు రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. రొటేషన్ పద్ధతి, గత రెండు పర్యాయాల రిజర్వేషన్ల లెక్కలను పరిశీలిస్తే ఈసారి కూడా ప్రకాశం పీఠం జనరల్ కేటగిరీకే వెళ్లే అవకాశం ఉందనే ప్రచారం సాగుతోంది.

**ప్రకాశం ఓసి అయితే మార్కాపురంకు బిసి వచ్చే అవకాశం ఉన్నట్లు సమాచారం..:** ఒకవేళ ప్రకాశం జిల్లా జెడ్పీ పీఠం ఓసి కి వెళితే, అదే ఉమ్మడి జిల్లా నుంచి పుట్టిన నూతన మార్కాపురం జిల్లా తొలి జెడ్పీ పీఠాన్ని బిసి లకు కేటాయించే అవకాశం ఉందనే చర్చ వినిపిస్తోంది. సామాజిక న్యాయం పాటించే క్రమంలో ఒక జిల్లా ఓసి అయితే, పక్కనే ఉన్న కొత్త జిల్లాను బిసి కి కేటాయించే అవకాశం ఉంటుందని అంటున్నారు. ఇది కేవలం అందుతున్న సమాచారం మేరకు జరుగుతున్న చర్చ మాత్రమే.

**మార్కాపురం జనాభా ప్రాతిపదికన బీసీలకు అనుకూలంగా ఉన్నట్లు గణాంకాలు..:** గణాంకాల ప్రకారం మార్కాపురం నూతన జిల్లాలో 21 మండలాలు ఉన్నాయి. జనాభా ప్రాతిపదికన చూస్తే యాదవ, కురుబ, గౌడ, పద్మశాలి, వడ్డెర, రజక, కుమ్మరి, నాయి బ్రాహ్మణ తదితర బీసీ కులాల జనాభా ఎక్కువగా ఉన్నట్లు చెబుతున్నారు. అందుకే జనాభా లెక్కల ప్రకారం బిసి రిజర్వేషన్ కు మార్కాపురం అర్హతలు కలిగి ఉందనే చర్చ జరుగుతోంది.

**బీసీలకే సీటు వచ్చే అవకాశం ఉన్నట్లు ప్రచారం..**

మార్కాపురం జిల్లా రాజకీయాల్లో ప్రస్తుతం బీసీలకే తొలి జెడ్పీ పీఠం దక్కే అవకాశం ఉన్నట్లు జోరుగా ప్రచారం జరుగుతోందని తెలిసిన సమాచారం. ముఖ్యంగా తెలుగుదేశం, వైఎస్సార్ కాంగ్రెస్, జనసేన పార్టీల్లో బీసీ సామాజిక వర్గానికి చెందిన పలువురు సీనియర్ నేతలు ఈ పీఠంపై ఆశలు పెట్టుకున్నట్లు సమాచారం. ఎవరికి వారు అధిష్టానం వద్ద లాబీయింగ్ మొదలు పెట్టినట్లు కూడా ప్రచారం జరుగుతోంది.

**అధికారిక నోటిఫికేషన్ వచ్చే వరకు వేచి చూడాల్సిందే...**

ప్రస్తుతం ఇవన్నీ రాజకీయ వర్గాల్లో వినిపిస్తున్న చర్చ, అందుతున్న సమాచారం మేరకు మాత్రమే. రాష్ట్ర వ్యాప్తంగా 26 జిల్లాల్లో దాదాపు 8 నుంచి 10 జిల్లాల జెడ్పీ పీఠాలు బిసి లకు రిజర్వ్ అయ్యే అవకాశం ఉందని ప్రచారం జరుగుతోంది. అందులో మార్కాపురం పేరు కూడా వినిపిస్తున్నట్లు సమాచారం. అయితే ప్రభుత్వం నుంచి అధికారిక నోటిఫికేషన్ వచ్చే వరకు వేచి చూడాల్సిందే.

పెన్ పవర్
MARKAPURAM మార్కాపురం
మార్కాపురం - ప్రకాశం

# పేదల సొంతింటి కల కూటమి ప్రభుత్వంలో సాకారం

**- ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ రావు**

**-193 మంది లబ్ధిదారులకు గృహ నిర్మాణ మంజూరు పత్రాలను పంపిణీ చేసిన ఎమ్మెల్యే**





**ఒంగోలు టౌన్, పెన్ పవర్ అక్టోబర్ 03**

ఒంగోలు నియోజకవర్గ పరిధిలో అర్హులైన పేదల సొంతింటి కలను సాకారం చేయడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం గృహ నిర్మాణ పథకానికి ప్రాధాన్యతనిస్తోందని ఒంగోలు శాసనసభ్యులు దామచర్ల జనార్దన్ రావు తెలిపారు. శనివారం ఒంగోలు నగరంలోని క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఒంగోలు నియోజకవర్గ పరిధిలోని మొత్తం 193 మంది లబ్ధిదారులకు గృహ నిర్మాణ శాఖ ద్వారా మంజూరైన ఇళ్ల నిర్మాణ అనుమతి పత్రాలను ఆయన అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో లబ్ధిదారులను ఉద్దేశించి మాట్లాడుతూ, ఒంగోలు నగర పరిధిలో 153 మంది లబ్ధిదారులకు ఒక్కొక్క ఇంటి నిర్మాణానికి రూ. 2.50 లక్షల చొప్పున ఆర్థిక సహాయంతో గృహ నిర్మాణాలు చేపట్టేందుకు మంజూరు చేసినట్లు తెలిపారు. అదేవిధంగా కొత్తపట్నం మండల పరిధిలో 40 మంది లబ్ధిదారులకు ఒక్కొక్క ఇంటి నిర్మాణానికి రూ. 2.89 లక్షల చొప్పున మంజూరు చేసినట్లు వివరించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఒంగోలు నియోజకవర్గ పరిధిలో ఇప్పటివరకు మొత్తం 523 గృహాల నిర్మాణానికి సంబంధించి రూ.14.62 కోట్ల నిధులు మంజూరు చేసినట్లు ఎమ్మెల్యే తెలిపారు. అర్హులైన పేద కుటుంబాలకు సొంత ఇల్లు కల్పించడం ద్వారా వారి జీవన ప్రమాణాలను మెరుగుపరిచేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని పేర్కొన్నారు. ఇంటి స్థలం ఉండి, సొంతంగా ఇల్లు నిర్మించుకోవాలనే ఆసక్తి ఉన్న అర్హులైన వారు గృహ నిర్మాణ పథకానికి దరఖాస్తు చేసుకోవాలని ఈ సందర్భంగా ఆయన సూచించారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరూ ప్రభుత్వ పథకాల గురించి తెలుసుకొని, సంబంధిత అధికారులను సంప్రదించి అవసరమైన దరఖాస్తు ప్రక్రియను పూర్తి చేసుకోవాలని కోరారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన లబ్ధిదారులకు చేరేలా సంబంధిత అధికారులు సమన్వయంతో పనిచేయాలని, గృహ నిర్మాణ కార్యక్రమాల అమలులో లబ్ధిదారులకు అవసరమైన సహకారం అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గృహ నిర్మాణ శాఖ అధికారులు, కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గృహ నిర్మాణ సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీనివాస్ ప్రసాద్, డి ఈ ఎస్. శ్రీనివాసరావు, ఒంగోలు ఏఎంసీ చైర్మన్ రాచగొర్ల వెంకటరావు, నగర టిడిపి అధ్యక్షులు బండారు మదన్, ఏఈలు నాంచారెడ్డి, మనోజ్ శంకర్రావు పాల్గొన్నారు.

# కమిషనర్ రమణబాబును అభినందించిన కలెక్టర్ విజయ సునీత



**గిద్దలూరు:పెన్ పవర్ అక్టోబర్ 03**

గిద్దలూరు మున్సిపల్ కమిషనర్ ఈవీ. రమణబాబును జిల్లా కలెక్టర్ ఎం. విజయ సునీత శనివారం కలెక్టరేట్‌లో ప్రత్యేకంగా అభినందించారు. స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ మున్సిపాలిటీ-2026 రాష్ట్రస్థాయి అవార్డుకు గిద్దలూరు మున్సిపాలిటీ ఎంపిక కావడంపై కలెక్టర్ ప్రశంసించారు. పారిశుద్ధ్యం, డోర్ టు డోర్ చెత్త సేకరణ, వ్యర్థాల నిర్వహణ, స్వచ్ఛత కార్యక్రమాల్లో చేపట్టిన చర్యలకు ఈ గుర్తింపు లభించిందన్నారు భవిష్యత్తు లో కూడా ఇట్లే కార్యక్రమాలు రూపొందించి అమలు చేయలని కలెక్టర్ విజయసునిత కోరారు.

# మంత్రి గొట్టిపాటి ఆదేశాలతో ఇనాం భూములకు బిందు సేద్యం

**రైతుల సమస్యలను అర్థం చేసుకొని ఈనాం భూముల విషయంలో మక్కెన జగదీష్ జోక్యం**

**మంత్రి గొట్టిపాటి దృష్టికి పలుమార్లు తీసుకుపోవడంతో**

**ఈనాం భూముల బిందు సేద్య సమస్యకు శాశ్వత పరిష్కారం**

**ఈనాం భూములకు త్వరలో అందుకోబోతున్న బిందు సేద్యం**



**సంతమాగులూరు, పెన్ పవర్, అక్టోబర్ 03**

రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఆదేశాల మేరకు ఇనాం భూములకు బిందు సేద్యం సౌకర్యం కల్పించే ప్రక్రియ ముందుకు సాగింది. సంతమాగులూరు మండలం కొమ్మాలపాడు, మక్కెనవారిపాలెం, సజ్జాపురం, చెన్నుపల్లి గ్రామాల పరిధిలోని ఇనాం భూములకు రాయితీపై బిందు సేద్యం పరికరాలు అందించేందుకు మక్కెన జగదీష్ పలమార్లు విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ను పలుమార్లు కలిసి ఈనామ్ భూముల బిందు సేద్యం గురించి అధికారులు చర్యలు తీసుకునేలా మాట్లాడడం జరిగింది. ఇనాం భూముల సమస్య దశాబ్దాలుగా, కొన్ని చోట్ల శతాబ్దాలుగా సాగు చేసుకుంటున్నప్పటికీ యాజమాన్య హక్కులు లేకపోవడంతో ప్రభుత్వ రాయితీలు అందడం లేదని, నీటి కొరత కారణంగా పంటలు దెబ్బతింటున్నాయని ఆయా గ్రామాల రైతులు ఇటీవల సంతమాగులూరులోని మంత్రి గొట్టిపాటి రవికుమార్‌ను కలిసి తమ సమస్యను వివరించారు. ఇనాం భూములకు బిందు సేద్యం సౌకర్యం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. రైతుల విజ్ఞప్తిపై మంత్రి గొట్టిపాటి రవికుమార్ తక్షణమే స్పందించి సంబంధిత అధికారులను ఆదేశించారు. మంత్రి ఆదేశాల ఫలితంగా కొమ్మాలపాడు, మక్కెనవారిపాలెం గ్రామాలకు చెందిన రైతులు ఒంగోలులోని ఆంధ్రప్రదేశ్ సూక్ష్మ సేద్య పథకం కార్యాలయంలో ప్రాజెక్టు సంచాలకులు శ్రీనివాస్‌ను కలిసి తమ వివరాలు సమర్పించారు. దీనిపై అధికారులు సానుకూలంగా స్పందించి బిందు సేద్యం పరికరాల సరఫరాదారులతో మాట్లాడారు. మంత్రి గొట్టిపాటి ఆదేశాలతో అధికార యంత్రాంగం స్పందించడంతో త్వరలోనే అవసరమైన ఇనాం భూముల రైతులకు బిందు సేద్యం సౌకర్యం అందనున్నట్లు అధికారులు హామీ ఇచ్చారు. దీంతో ఇన్నాళ్లుగా బిందు సేద్యం సౌకర్యం కోసం ఎదురుచూస్తున్న ఇనాం భూముల రైతుల్లో ఆశలు చిగురించాయి. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు మక్కెన జగదీష్, మక్కెన శ్రీనివాసరావు, దండా శ్రీనివాసరావు, టీ వెంకట్రావు, మోతాదు బాషా, హాఫిజ్, మాదీనా మౌలాలి, కోస్టాలా మస్తాన్వలి తదితరులు పాల్గొన్నారు.

# నత్తనడకన గిద్దలూరు రైల్వేస్టేషన్‌లో అమృత్ స్టేషన్ అభివృద్ధి పనులు

**2024 ఫిబ్రవరి 26 ప్రధాని నరేంద్రమోడీ జీ వర్చువల్ గా హట్టహాసంగా ప్రారంభించారు**

**రెండు సంవత్సరాలు గడుస్తున్నా పూర్తికాని అభివృద్ధి పనులు**






**గిద్దలూరు పెన్ పవర్ అక్టోబర్ 03**

గిద్దలూరు రైల్వేస్టేషన్ ను అమృత్ స్టేషన్ గా మార్చి ప్రయాణికులకు అ ని మౌలిక వసతుల కల్పన , స్టేషన్ ను సుందరంగా తీర్చిదిద్దే కార్యక్రమాలు చేయాల్సి ఉంది , 2024 ప్రధాని నరేంద్రమోదీ జీ ఇందుకు 11 కోట్ల రూపాయలు కేటాయించి వర్చువల్ ప్రారంభించారు. అప్పట్లో పనులు మొదలు పెట్టారు , కానీ ఈ అభివృద్ధి పనులు ఒక ప్రణాళిక ప్రకారం చేపట్టక ఇష్టారీతిన చేశారు మెడీలో కొంత కాలం పనులను ఆపేశారు. రైల్వేస్టేషన్ లో గ్రానైట్ బండ పరుపు కొంత మీరవేశారు, స్టేషన్లో షెడ్ల నిర్మాణం , లిఫ్ట్ ఏర్పాటు చేశారు. ఆతరువాత పనులు ఆగిపోయాయి ముందుభాగం లో కాంపౌండ్ నిర్మాణం ను పడగొట్టారు కానీ నిర్మాణం చేయలేదు. ప్రస్తుతం స్టేషన్ లోపల వెటింగ్ హాల్స్ , టీ టీ ఏ రూమ్ లనిర్మాణం జరుగుతుంది. గత రెండురోజుల క్రితం డి ఆర్ ఎమ్ స్టేషను సందర్శించడం జరిగింది ఈసందర్భంగా డిఆర్ ఎమ్ పనులు నత్తనడకన జరుగుతుండటం గమనించి కాంట్రాక్టర్ , అధికారుల పై ఆగ్రహం వ్యక్తం చేశారు. స్టేషన్ ముందు భాగం సుందరీ కరణ పనులు నత్తనడకన సాగుతున్నాయి, ఈ గిద్దలూరు రైల్వేస్టేషన్ తో పాటు మొదలు పెట్టిన అన్ని స్టేషన్లు అన్ని సుందరంగా తయారుకాగా గిద్దలూరు లో అబివృద్ధి పనులు నత్తనడకన సాగుతుండటం పట్ల ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. స్టేషన్లో లోపల మంచి నీటి వసతి కల్పించాలని కోరుతున్నారు , గతంలో ఏర్పాటు చేసిన ఆర్వో ప్లాంట్ ములబడింది , దీంతో మంచి నీరు కరవయ్యాయని ప్రయాణికులు వాపోతున్నారు. పట్టణం నడిబొడ్డున ఉన్న రైల్వేస్టేషన్ అంద వికారంగా కన బడుతోందని పలువులు ఆరోపిసున్నారు. ఇప్పటికైనా రై ల్వే అధికారు లు అబివృద్ధి పనులను వేగవంతం చేసి మౌలిక వసతుల కల్పించాలని కోరుతున్నారు.

# పట్టణాన్ని అభివృద్ధిలో అగ్రగామిగా నిలుపుతాం - ఎమ్మెల్యే కందుల

**ఎస్టేట్, డ్రైవర్స్ కాలనీలో సీసీ రోడ్లకు శంకుస్థాపన**



**మార్కాపురం పెన్ పవర్ అక్టోబర్ 3:**

అభివృద్ధిలో మార్కాపురం ప్రాంతాన్ని అగ్రభాగాన నిలబెడతామని ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి అన్నారు.మార్కాపురం పట్టణ శివారు ప్రాంతాలైన ఎస్టేట్, డ్రైవర్స్ కాలనీలలో శనివారం సీసీ రోడ్ల నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు. మార్కాపురం మున్సిపాలిటీకి నిధుల కింద మంజూరైన రూ. 35 కోట్లలో భాగంగా ఈ రోడ్లను నిర్మిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, జిల్లా కేంద్రమైన మార్కాపురం పట్టణ సుందరీకరణలో భాగంగా మొదట సీసీ రోడ్లు, అనంతరం సీసీ డ్రైన్లను పూర్తి చేసి పట్టణాన్ని అత్యంత సుందరంగా తీర్చిదిద్దుతామన్నారు. ఇప్పటికే మార్కాపురాన్ని జిల్లా కేంద్రంగా ప్రభుత్వం ప్రకటించిందని, వెలుగొండ ప్రాజెక్టును పూర్తి చేసి ఈ ప్రాంతాన్ని హార్టికల్చర్ హబ్‌గా తీర్చిదిద్దుతున్నామన్నారు. త్వరలో ఇంటింటికి పైప్‌లైన్ పనులు పూర్తి చేసి ప్రతి ఇంటికి తాగునీరు అందిస్తామన్నారు. గత వైసీపీ పాలనలో ఈ ప్రాంతం భూకబ్జాలకు నిలయంగా, అరాచకాలకు కేరాఫ్ అడ్రస్‌గా మారిందని విమర్శించారు. సుపరిపాలన అందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని, ప్రభుత్వానికి ప్రజలు మద్దతు పలకాలని, తద్వారా మార్కాపురం ప్రాంతాన్ని అభివృద్ధి పథంలో ముందుంచుతానని అన్నారు.

# తైక్వాండోలో శ్రీ గాయత్రి విద్యార్థుల జయకేతనం

## - రాష్ట్రస్థాయి పోటీల్లో ఆరుగురికి స్వర్ణ పతకాలు -విజేతలకు ఘన సన్మానం



**కందుకూరు పెన్ పవర్, అక్టోబర్ 3:**

పట్టణంలోని ఇస్లాంపేట షాదీఖానాలో నిర్వహించిన రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ తైక్వాండో పోటీల్లో శ్రీ గాయత్రి విద్యాసంస్థల విద్యార్థులు సత్తా చాటారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 200 మంది విద్యార్థులు పాల్గొన్న ఈ పోటీల్లో 11 మంది స్వర్ణ పతకాలు సాధించగా, వారిలో శ్రీ గాయత్రి విద్యాసంస్థలకు చెందిన ఆరుగురు విద్యార్థులు బంగారు పతకాలు సాధించి ప్రత్యేక గుర్తింపు పొందారు. స్వర్ణ పతకాలు సాధించిన విద్యార్థులు డి. లాస్యప్రియ, ఎస్‌డీ. ఫాజిల్, ఎస్‌కే. రహీం, ఎస్‌కే. హసీనా, ఎ. పూజిత, జి. వర్షితలను శ్రీ గాయత్రి విద్యాసంస్థల చైర్మన్ సీహెచ్. రామకృష్ణారావు ఘనంగా సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా చైర్మన్ రామకృష్ణారావు మాట్లాడుతూ విజయం ఒక్కరోజులో సాధ్యమయ్యేది కాదని, దాని వెనుక నిరంతర సాధన, కృషి, ఎన్నో సవాళ్లను అధిగమించే పట్టుదల ఉంటాయని పేర్కొన్నారు. క్రీడా వేదికపై తమ ప్రతిభను నిరూపించుకున్న విద్యార్థులకు అభినందనలు తెలియజేస్తూ, విద్యతోపాటు క్రీడల్లోనూ రాణించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు.ఈ విజయానికి కృషి చేసిన శ్రీ గాయత్రి తైక్వాండో మాస్టర్ అఖిల్‌ను రాష్ట్ర తైక్వాండో కార్యదర్శి ఎస్‌కే. అబ్దుల్ సలాం, పాఠశాల ఏజీఎం సురేష్, ప్రిన్సిపల్ నీలు కుమారి ఘనంగా సన్మానించారు.శ్రీ గాయత్రి విద్యాసంస్థల డైరెక్టర్ భారద్వాజ్ విజేతలకు శుభాకాంక్షలు తెలియజేస్తూ, విద్యార్థులను క్రీడల్లో ప్రోత్సహించడంలో తమ విద్యాసంస్థలు ఎల్లప్పుడూ ముందుంటాయని తెలిపారు. విద్యార్థుల విజయంపై పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు.

# ఆంధ్ర కేసరి వర్సిటీ ఫలితాల్లో శ్రీ వివేక డిగ్రీ కళాశాల విజయకేతనం



**కందుకూరు పెన్ పవర్, అక్టోబర్ 3**

ఆంధ్ర కేసరి యూనివర్సిటీ తాజాగా విడుదల చేసిన డిగ్రీ 2వ సెమిస్టర్ ఫలితాల్లో కందుకూరు బి.ఆర్.ఆక్స్‌ఫర్డ్ విద్యాసంస్థల వారి శ్రీ వివేక డిగ్రీ కళాశాల విద్యార్థులు 91 శాతం ఉత్తీర్ణత సాధించి ఘన విజయం నమోదు చేశారని కళాశాల ప్రిన్సిపాల్ అబ్బూరి వెంకటేశ్వర్లు తెలిపారు.వివిధ విభాగాల్లో విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచారు. బీఎస్సీలో ఎన్. శ్రీవల్లి 96 శాతం, ఎం.సురేఖ 91 శాతం, ఎస్.కె. సమ్రీన్ 90 శాతం మార్కులతో టాపర్లుగా నిలిచారు. బీసీఏలో ఎస్.కె.సుబిన్ 94 శాతం,సిహెచ్. అమృత 92 శాతం, ఎస్.కె. సమ్రిన్ 91 శాతం మార్కులు సాధించారు.బీకాంలో జి. జాహ్నవి 91 శాతం, బి. యశోద 90 శాతం, జి. శృతి 88 శాతం మార్కులతో అత్యుత్తమ ఫలితాలు సాధించారు.ఈ సందర్భంగా విద్యాసంస్థల కరస్పాండెంట్ బండి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఈ ఏడాది నుంచి అంతర్జాతీయ స్థాయి ఏసిసిఏ (ఇంటిగ్రేటెడ్) కోర్సును ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. కళాశాలలో ఎన్సిసి సౌకర్యం కూడా అందుబాటులో ఉందని, ఎన్సిసి సిసర్టిఫికెట్ ఉన్న వారికి ప్రభుత్వ ఉద్యోగాల్లో 15 శాతం రిజర్వేషన్ లభిస్తుందని పేర్కొన్నారు. అత్యుత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను బి.ఆర్.ఆక్స్‌ఫర్డ్ విద్యాసంస్థల చైర్మన్ ఉన్నం భాస్కరరావు, డైరెక్టర్లు జి. బాల భాస్కరరావు, బి.నరేంద్రబాబు, ప్రిన్సిపాల్ అబ్బూరి వెంకటేశ్వర్లు,ఇంచార్జి డి.శ్రీనివాసరావు,తదితర అధ్యాపక సిబ్బంది అభినందించారు.

# గిద్దలూరు మున్సిపాలిటీకి రాష్ట్రస్థాయి స్వచ్ఛత అవార్డు

**గిద్దలూరు పెన్ పవర్ అక్టోబర్ 03**

గిద్దలూరు మున్సిపాలిటీ కి ప్రతిష్టాత్మకమైన రాష్ట్రస్థాయి “స్వచ్ఛ ఆంధ్ర – స్వచ్ఛ మున్సిపాలిటీ” అవార్డుకు ఎంపికైంది. ఈ సందర్భంగా శుక్రవారం విజయవాడలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా గిద్దలూరు మున్సిపల్ కమిషనర్ రమణబాబు అవార్డును అందుకున్నారు. మున్సిపాలిటీ పరిధిలో పారిశుధ్య నిర్వహణ, పరిశుభ్రత కార్యక్రమాలు, ప్రజల్లో స్వచ్ఛతపై అవగాహన కల్పించడం తదితర అంశాల్లో చేపట్టిన చర్యలకు గుర్తింపుగా ఈ రాష్ట్రస్థాయి అవార్డు లభించింది. ఈ సందర్భంగా మున్సిపల్ అధికారులు, సిబ్బంది, ప్రజాప్రతినిధులు, పట్టణ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.



# పేదల పాలిట ఆపద్బాంధవుడు ‘10 రూపాయల డాక్టర్’ బ్రహ్మానందరెడ్డి

## గాయత్రి హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత మెగా హెల్త్ క్యాంప్.. ఒకే వేదికపై పలువురు వైద్య నిపుణులు.

**గిద్దలూరు పెన్ పవర్ అక్టోబర్ 03**

గిద్దలూరు నియోజకవర్గ పేద, మధ్యతరగతి ప్రజలకు అందుబాటులో వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో గాయత్రి హాస్పిటల్ వ్యవస్థాపకులు 10 రూపాయల డాక్టర్’ డాక్టర్ బ్రహ్మానందరెడ్డి ఆధ్వర్యంలో మరో ఉచిత మెగా హెల్త్ క్యాంప్ నిర్వహించనున్నారు.వైద్య సేవలను ప్రజలకు మరింత చేరువ చేయడమే లక్ష్యంగా ఇప్పటికే అనేక ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించిన డాక్టర్ బ్రహ్మానందరెడ్డి, ఈ క్యాంపు ద్వారా కూడా ప్రజలకు నిపుణులైన వైద్యుల సేవలను అందుబాటులోకి తీసుకువస్తున్నారు.

**ఒకే వేదికపై పలువురు వైద్య నిపుణులు.**

ఈప్రత్యేక వైద్య శిబిరానికి వివిధ విభాగాల్లో నైపుణ్యం కలిగిన వైద్య నిపుణులు విచ్చేయనున్నారని డాక్టర్ తెలిపారు. డాక్టర్ నారాయణరెడ్డి,ఎండి ,డి ఎమ్ --- కార్డియాలజిస్ట్: గుండె సంబంధిత వ్యాధులకు ప్రత్యేక వైద్య నిపుణులు. గుండె సమస్యలకు సంబంధించి అవసరమైన వైద్య పరీక్షలు, నిపుణుల సలహాలు అందించనున్నారు. డాక్టర్ బ్రహ్మానందరెడ్డి, ఎమ్ ఎస్ ఆర్తో ఆర్థోపెడిక్ సర్జన్: ఎముకలు, కీళ్లు, కండరాలు, ఆర్థోపెడిక్ సమస్యలకు ప్రత్యేక వైద్య సేవలు అందించనున్నారు. డాక్టర్ గాయత్రి, ఎమ్ ఎస్ ,డిజి ఓ గైనకాలజిస్ట్, జనరల్ సర్జన్:మహిళలకు సంబంధించిన ఆరోగ్య సమస్యలతో పాటు అవసరమైన జనరల్ సర్జరీ వైద్య సేవలను అందించనున్నారు. డాక్టర్ భవ్య, అబ్స్టెట్రిషియన్, గైనకాలజిస్టా: మహిళల ఆరోగ్యం, గర్భధారణకు సంబంధించిన సమస్యలు తదితర అంశాలపై నిపుణుల వైద్య సలహాలు అందించనున్నారు.

**బీపీ, ఈసీజీ, షుగర్ పరీక్షలు కూడా:**

క్యాంపులో బిబిపీ, ఈ సి జి, షుగర్ పరీక్షలు, కంటి పరీక్షలు వంటి సేవలను ఉచితంగా నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. అవసరమైన వారికి వైద్యుల సలహా మేరకు తగిన వైద్య సేవలు



అందించనున్నట్లు పేర్కొన్నారు.

**అక్టోబర్ 4న ఉచిత మెగా హెల్త్ క్యాంప్:-**

2026 అక్టోబర్ 4న ఆదివారం ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు ఈ ఉచిత మెగా హెల్త్ క్యాంప్ నిర్వహించనున్నట్లు డాక్టర్ బ్రహానందరెడ్డి , డాక్టర్ గాయత్రీ లు తెలిపారు

గిద్దలూరుద, శివాజీ రోడ్డులోని గాయత్రి హాస్పిటల్ ప్రాంగణంలో క్యాంప్ నిర్వహించనున్నట్లు తెలిపారు

ప్రజలకు నిపుణులైన వైద్యుల సేవలు అందుబాటులోకి తీసుకురావడంతో పాటు, ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొనే వారికి వైద్యం మరింత చేరువ చేయాలనే ఉద్దేశంతో డాక్టర్ బ్రహ్మానందరెడ్డి చేస్తున్న



సేవలను పలువురు అభినందిస్తున్నారు.

**వైద్యం ఒక సేవగా.. ప్రజల ఆరోగ్యం ఒక బాధ్యతగా.**

‘10 రూపాయల డాక్టర్’గా ప్రజల్లో ప్రత్యేక గుర్తింపు పొందిన డాక్టర్ బ్రహ్మానందరెడ్డి. గాయత్రి హాస్పిటల్ ద్వారా నాణ్యమైన వైద్య సేవలను అందించడంతో పాటు, తరచూ ఉచిత మెగా హెల్త్ క్యాంపులు నిర్వహిస్తూ ప్రజలకు చేరువవుతున్నారు. వివిధ విభాగాల నిపుణులను ఒకే వేదికపైకి తీసుకువచ్చి ప్రజలకు వైద్య సలహాలు, పరీక్షలు అందించడం ద్వారా తన సేవా కార్యక్రమాలను కొనసాగిస్తున్నారు.

ప్రజల ఆరోగ్యమే లక్ష్యంగా.. నిపుణులైన వైద్యుల సేవలు అందరికీ అందుబాటులో ఉండాలనే సంకల్పంతో గాయత్రి హాస్పిటల్ ముందుకు సాగుతోందని తెలిపారు.

# గర్భిణులు పోషకాహారంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి

## - బృందావన కాలనీలో 9వ రాష్ట్రీయ పోషణ మాసోత్సవం

## - అంగన్వాడీ సిబ్బందికి ఘన సన్మానం



**కందుకూరు పెన్ పవర్, అక్టోబర్ 3:**

గర్భిణులు, బాలింతలు పోషకాహారంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని, అంగన్వాడీ కేంద్రాల ద్వారా ప్రభుత్వం అందిస్తున్న పోషకాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని పలువురు వక్తలు సూచించారు. కందుకూరు ఏ సెక్టార్ పరిధిలోని బృందావన కాలనీ అంగన్వాడీ కేంద్రంలో సీడీపీఓ ఉషారాణి ఆదేశాల మేరకు సూపర్వైజర్ యు. ప్రభావతి ఆధ్వర్యంలో 9వ రాష్ట్రీయ పోషణ మాసోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న బీజేపీ నాయకులు, కార్యకర్తలు గర్భిణులు, బాలింతలకు అందుతున్న పోషకాహారంపై అవగాహన కల్పించారు. గర్భం దాల్చినప్పటి నుంచి అంగన్వాడీ కేంద్రాల ద్వారా అందించే గుడ్లు, పాలు, బాల సంజీవని కిట్లను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వీటితో పోషకాహార లోపం, రక్తహీనతను నివారించేందుకు సహాయపడుతుందని వివరించారు. ఈ సందర్భంగా రాఘవయ్య మాట్లాడుతూ ప్రధానమంత్రి మాతృ వందన యోజన ద్వారా అర్హులైన గర్భిణులు, బాలింతలకు ప్రభుత్వం ఆర్థిక సహాయం అందిస్తోందని తెలిపారు. ఈ పథకానికి సంబంధించిన నిబంధనలు, అర్హతలు, ప్రయోజనాలపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని సూచించారు. సరిత మాట్లాడుతూ తల్లులు, పిల్లలకు పోషకాహారం అందించడంలో అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు కీలక పాత్ర పోషిస్తున్నారని పేర్కొన్నారు. వారి సేవలను గుర్తించి గౌరవించాలని కోరారు. అనంతరం బృందావన కాలనీకి చెందిన గర్భిణిని చీరతో సత్కరించారు. సూపర్వైజర్ యు. ప్రభావతితో పాటు 15 మంది అంగన్వాడీ కార్యకర్తలను, ఒక ఆయాను శాలువాలతో ఘనంగా సన్మానించారు.

**ఐదు అంశాలపై అవగాహన**

ఈ నెల రోజుల పోషణ మాసోత్సవంలో భాగంగా ఆహారంలో వైవిధ్యం, తగినంత ప్రోటీన్ల వినియోగం, అంగన్వాడీ కేంద్రాల్లో తాజా వేడి భోజనం, సమాజ భాగస్వామ్యం--బాధ్యత, పోషణ--బాల్య ప్రేరణ, ప్రధానమంత్రి మాతృ వందన యోజన వంటి అంశాలపై అవగాహన కల్పిస్తున్నారు. చివరి వారంలో మాతృ వందన యోజనపై ప్రత్యేకంగా వివరించి, అర్హులైన మహిళలు పథకం ప్రయోజనాలను పొందేలా అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సరిత, సురేష్, రాఘవయ్య, అచ్చితయ్య, ప్రసాద్, మోజేష్, రాజా తదితర బీజేపీ నాయకులు, కార్యకర్తలు, అంగన్వాడీ సిబ్బంది, గర్భిణులు, బాలింతలు, స్థానిక మహిళలు పాల్గొన్నారు.

# స్వచ్ఛతలో గిద్దలూరు ఏరియా ఆసుపత్రికి ప్రథమ స్థానం

## -స్వర్ణ ఆంధ్ర--స్వచ్ఛ ఆంధ్ర’లో ఉత్తమ ప్రతిభ..

## స్వచ్ఛ ఆంధ్ర అవార్డుకు ఎంపిక

**గిద్దలూరు పెన్ పవర్ అక్టోబర్ 03**

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన స్వర్ణ ఆంధ్ర--స్వచ్ఛ ఆంధ్ర (సాస) కార్యక్రమం--2026లో భాగంగా నిర్వహించిన ఆసుపత్రుల పరిశుభ్రత, పారిశుద్ధ్య నిర్వహణ పరిశీలనలో గిద్దలూరు ఏరియా ఆసుపత్రి జిల్లా స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచింది. మార్కాపురం జిల్లా పరిధిలో నిర్వహించిన పరిశీలనలో ప్రథమ స్థానాన్ని సాధించి ‘స్వర్ణ ఆంధ్ర--స్వచ్ఛ ఆంధ్ర’ అవార్డుకు ఎంపికైంది. ఆసుపత్రి పరిసరాల పరిశుభ్రత, పారిశుద్ధ్య నిర్వహణ, స్వచ్ఛతకు సంబంధించిన అంశాలను పరిశీలించిన అనంతరం గిద్దలూరు ఏరియా ఆసుపత్రి ఉత్తమ ప్రతిభ కనబరిచినట్లు అధికారులు గుర్తించారు. ఈ నేపథ్యంలో ఆసుపత్రికి ‘స్వచ్ఛ ఆంధ్ర’ అవార్డు లభించింది.

**కలెక్టర్ చేతుల మీదుగా అవార్డు**

శుక్రవారం రాత్రి మార్కాపురంలో జరిగిన ఈ కార్యక్రమంలో గిద్దలూరు ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఆదాం అవార్డును మార్కాపురం జిల్లా కలెక్టర్ విజయ సునీత చేతుల మీదుగా అందుకున్నారు. ఆసుపత్రి సిబ్బంది సమష్టి కృషితోనే ఈ గుర్తింపు



సాధ్యమైందని డాక్టర్ ఆదాం పేర్కొన్నారు. జిల్లా స్థాయిలో గిద్దలూరు ఏరియా ఆసుపత్రి ప్రథమ స్థానం సాధించడం పట్ల ఆసుపత్రి సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు. పలువురు నేతలు వైద్యశాల డాక్టర్లను, సిబ్బందిని అభినందించారు.

# మంచినీటి చెరువులో పడి మహిళ మృతి



**పుల్లల చెరువు పెన్ పవర్ అక్టోబర్ 3**

పుల్లల చెరువు మండలం ముటుకుల గ్రామంలోని మంచినీటి చెరువులో పడి ఓ మహిళ మృతి చెందిన ఘటన శనివారం వెలుగుచూసింది. కుటుంబ కలహాల నేపథ్యంలో శుక్రవారం ఇంటి నుంచి బయటకు వెళ్లిన కళ్లెం శివ పార్వతి (23) శనివారం చెరువులో మృతదేహంగా కనిపించింది.స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం శివపార్వతి స్వస్థలం పల్నాడు జిల్లా దుర్గి పట్టణం.కొంతకాలంగా ముటుకుల గ్రామంలో గుడారాలు ఏర్పాటు చేసుకుని కుటుంబంతో కలిసి సంచార జీవనం సాగిస్తున్నారు.శనివారం కుటుంబంలో చోటుచేసుకున్న కలహాల నేపథ్యంలో ఆమె ఇంటి నుంచి బయటకు వెళ్లినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. అనంతరం ఆమె ఆచూకీ కోసం గాలించగా, శనివారం ముటుకులలోని మంచినీటి చెరువులో మృతదేహం కనిపించింది. మృతురాలికి భర్తతో పాటు ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఈ ఘటనతో కుటుంబ సభ్యులు, బంధువులు విషాదంలో మునిగిపోయారు.ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలకు గుర్రం ఆల్ఫ్రెడ్ క్రికెట్ ఫౌండేషన్‌కు చెందిన క్రీడాకారులు ఎంపిక



**గిద్దలూరు పెన్ పవర్ అక్టోబర్ 03**

ఉమ్మడి ప్రకాశం జిల్లా, ఒంగోలు లో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ప్రకాశం ఆధ్వర్యంలో జరిగిన అండర్ 14 బాలుర క్రికెట్ ఎంపిక లో విశ్వ భారతి ఐఐటి ఫౌండేషన్లో ఎనిమిదవ తరగతి చదువుతున్న పి. ఉమర్ ఖాన్,రఘుపతి. నవదీప్ రాయల్ , అండర్ 19 బాలికల క్రికెట్ లో... నారాయణ హై స్కూల్లో చదువుతున్న బి.గాయత్రి, మనస్విని,తేజస్విని, ఆర్ ఆర్ స్కూల్లో .....8వ తరగతి చదువుతున్న షేక్ అర్షియా, అండర్ 17 బాలికల క్రికెట్లో..... జిల్లా పరిషత్ (బాలికల )ఉన్నత పాఠశాల గిద్దలూరు నందు ఎనిమిదవ తరగతి చదువుతున్న షేక్ కరిష్మా ఎంపికైనట్లు గుర్రం ఆల్ఫ్రెడ్ క్రికెట్ ఫౌండేషన్ హెడ్ కోచ్ జి.శోభన్ బాబు, కోచ్ డి.మనోజ్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఆంధ్ర ప్రదేశ్ ఆధ్వర్యంలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో వీరు పాల్గొంటారని తెలిపారు.

# సోమవారం అద్దంకి రానున్న మందకృష్ణ మాదిగలి



**సంతమాగులూరు, పెన్ పవర్, అక్టోబర్ 03**

సింగరాయకొండ శ్రీ చైతన్య నవోదయ కోచింగ్ సెంటర్ లో అనుమానస్పద రీతిలో మృతి చెందిన సయ్యద్ తౌశిక్,న్యాయం జరగక, ఇక జరగదని భావించి తల్లి మౌలాబి ఆత్మహత్య చేసుకొని మరణ వాంగ్మూలం లో ఇచ్చిన వారిని ఈ సంఘటన కు కారకులైన వారిని వెంటనే అరస్ట్ చేసి కుటుంబానికి న్యాయం చేయాలనీ డిమాండ్ చేస్తూ ఈనెల 12 వ తేదీ న ఛలో ఒంగోలు లో మహా ధర్నా కు పద్మ శ్రీ మందకృష్ణ మాదిగ పిలుపు ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమం లో భాగంగా ఈనెల 05 వ తేదీ సోమవారం ఉదయం 10 గంటలకు అద్దంకిలో నియోజకవర్గ రౌండ్ టేబుల్ సమావేశశీ ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిధులుగా ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ విచ్చేయుచున్న సందర్భంగా అద్దంకి నియోజకవర్గ మండలశీలో ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, ముస్లిం మైనారిటీ,దళిత, కుల,విద్యార్థి అన్ని ప్రజా సంఘాలు రాజకీయ పార్టీలు ఈ కార్యక్రమంలో పాల్గొని ఈ సమావేశాన్ని విజయవంతం చేయాలని అద్దంకి నియోజకవర్గం ఎమ్మార్పీఎస్ ఇన్చార్జి పూనూరి రమేష్ తెలిపారు.

# ప్రజలందరికి నాణ్యమైన వైద్య సేవలు అందాలి

## ఏరియా ప్రభుత్వ వైద్య శాల చైర్మన్‌గా పదవి భాధ్యతలు చేపట్టిన ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్

## ఏరియా వైద్య శాలలో వసతుల ఏర్పాటు, సమస్యల పరిష్కారం, అభివృద్ధి కి కృషి





**ఆర్ సి ఇంచార్జి యర్రగొండపాలెం పెన్ పవర్ అక్టోబర్ 3**

ఏరియా ప్రభుత్వ వైద్య శాలలో పేద ప్రజలందరికి నాణ్యమైన వైద్య సేవలు అందాలని, 24గంటలు వైద్య సేవలు అందించే ఆసుపత్రిలో వైద్యులు అందుబాటులో ఉండాలని వైస్సార్సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎమ్మెల్యే ఏరియా ప్రభుత్వ వైద్యాశాల చైర్మన్ తాటిపర్తి చంద్రశేఖర్ అన్నారు. శనివారం ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ ఏరియా హాస్పిటల్ డెవలప్మెంట్ కమిటీ చైర్మన్ గా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా హాస్పిటల్ వైద్యులు, సిబ్బంది, కమిటీ సభ్యులతో కలిసి హాస్పిటల్ అభివృద్ధి పై సుదీర్ఘంగా చర్చించారు. అనంతరం జరిగిన అభినందన, సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడుతు, నియోజకవర్గ కేంద్రంలోని 30పడకల వైద్యాశాలను రోగుల అవసరార్ధం 17కోట్ల రూపాయల నిధులతో 100పడకల ఏరియా వైద్యాశాలాగా అప్పటి ముఖ్యమంత్రి వై యస్ జగన్మోహన్ రెడ్డి అభివృద్ధి చేసారని అన్నారు. ప్రతి ఒక్కరికి నాణ్యమైన 350 రకాల వైద్య సేవలు అందించేందుకు జగనన్న కృషి చేసారని అన్నారు. ప్రస్తుతం నెలకు దాదాపు పదివేల మంది ఏరియా వైద్య శాలలో సేవలు పొందుతున్నారని తెలిపారు. యర్రగొండపాలెంలో 100పడకల వైద్య శాల లేకుంటే రోగులు ప్రైవేటు వైద్య శాలకు వెళ్లి ఆర్థిక భారాన్ని భరించవలిసి వచ్చేదని, ఆ సమస్య తీరిందని అన్నారు. ప్రమాదాలలో గాయపడిన వారికీ, కాన్పుల సమయంలో అత్యవసరంగా రక్తం అవసరం ఉందని, హాస్పిటల్ లో రక్తనిధి కేంద్రం త్వరలో ప్రారంభం కాబోతుందని అన్నారు. గొప్పగా జిల్లా ఏర్పాటు చేశామంటున్నా ప్రభుత్వం పేదలకు వైద్య సేవలు అందించే ఆసుపత్రులకు నిధులు కేటాయించిలేదని, వైద్యుల భర్తీని పూర్తి చేయలేదని అన్నారు. ఏరియా వైద్యాశాలలో ట్రామా కేర్ సెంటర్, గుండె సంబంధిత వైద్యుల అవసరం ఉందని గుండె పోటు వచ్చిన వారికీ అత్యవసర ఇంజక్షన్ వైద్య శాలలోఉచితంగా అందుబాటులో ఉందని అన్నారు. రోగ నిర్ధారణ కోసం నిర్వహించే రక్త పరీక్షలకు రోగులను ప్రైవేట్ క్లినిక్లకు పంపిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. వైద్యశాలలోత్రాగునీటి సమస్య, డ్రైనేజి సమస్య ఉందని, వైద్య శాల ప్రాంగణంలో క్యాంటిన్ ఏర్పాటుకు సమావేశంలో నిర్ణయం తీసుకున్నామని త్వరలో టెండర్లు ఆహ్వానిస్తామని తెలిపారు.ఆసుపత్రిలో ఆక్సిజన్ ఏర్పాటు అవసరం ఉందని,ఖాళీగా ఉన్న డాక్టర్ల భర్తీకి కృషి చేసి ఏరియా వైద్య శాల అభివృద్ధికి కృషి చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో హాస్పిటల్ డెవలప్మెంట్ కమిటీ సభ్యులు మందుల శేషు, వైస్సార్సీపీ జిల్లా ఉపాధ్యక్షులు ఒంగోలు మూర్తిరెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు ఏకుల ముసలారెడ్డి, జడ్పీటీసీ చేదూరి విజయ్ భాస్కర్, రైతు సంఘం నాయకులు యర్రం రెడ్డి వెంకటేశ్వరరెడ్డి, సోషల్ మీడియా రాష్ట్ర కార్యదర్శి సయ్యద్ జబివుల్లా, మైనార్టీ నాయకులు షేక్ వలి,ఎస్టీ సెల్ నాయకులు రాములునాయక్,నాయకులు కొప్పర్తి ఓబులరెడ్డి, కందూరి గురు ప్రసాద్, ఒంగోలు సుబ్బారెడ్డి,మెడికల్ సూపరిండెంట్ యాదిద్య, వైద్యులు శ్రీనివాసరావు,కోట నాయక్, ముబీనా తదితరులు పాల్గొన్నారు.

## రాచర్ల మండలాన్ని కరువు మండలంగా ప్రకటించాలి

### తహసీల్దార్‌కు రైతు సంఘం నాయకుల వినతి



**గిద్దలూరు పెన్ పవర్ అక్టోబర్ 03**

రాచర్ల మండలాన్ని కరువు మండలంగా ప్రకటించి రైతులను ఆదుకోవాలని కోరుతూ మార్కాపురం జిల్లా రైతు సంఘం సహాయ కార్యదర్శి రామకృష్ణ, సీఐటీయూ రాచర్ల మండల కన్వీనర్ తామస్‌లు తహసీల్దార్ వెంకటేశ్వర్లుకు శనివాసరం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి రామకృష్ణ మాట్లాడుతూ.. రాచర్ల మండలంలో పంటలు తీవ్రంగా ఎండిపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారని తెలిపారు. సాగునీరు, తాగునీటి కొరతతో రైతాంగం తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటోందన్నారని. ప్రస్తుత పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని ప్రభుత్వం రాచర్ల మండలాన్ని కరువు మండలంగా ప్రకటించి, రైతులకు తగిన సహాయం అందించాలని డిమాండ్ చేశారు. కరువు పరిస్థితులపై అధికారులు సమగ్రంగా పరిశీలించి రైతులకు అవసరమైన ఉపశమన చర్యలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ రాచర్ల మండల కన్వీనర్ తామస్, నాయకులు వెన్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

## మధ్యవర్తిత్వంపై న్యాయవిజ్ఞాన సదస్సు



**గిద్దలూరు పెన్ పవర్ అక్టోబర్ 03**

గిద్దలూరు మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో మధ్యవర్తిత్వంపై గ్రామాలలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. గిద్దలూరు మండలంలోని సంజీవరాయనిపేట , తాళ్లపల్లె ,ముండ్లపాడు గ్రామాలలోని సచివాలయంలో జరిగినటువంటి మధ్యవర్తిత్వ కార్యక్రమంలో ప్యానల్ న్యాయవాది ఏం. పిచ్చయ్య మాట్లాడుతూ మధ్యవర్తిత్వం ద్వారా కక్షిదారులు తమ సమస్యలను తామే పరిష్కరించుకొనే అవకాశాన్ని కల్పించే ప్రక్రియ అని, మధ్యవర్తిత్వం అనేది నిర్దిష్టమైన ఆదేశిక నియమాలు అంటూ ఏమీ లేవని , ఇది పూర్తిగా స్వచ్ఛంద ప్రక్రియని , సమస్య పరిష్కారంలో కక్షిదారులే కీలకపాత్రుదారులని, కక్షిదారులు తమకు అనుకూలమైన రీతిలో పరిష్కారం చేసుకోవచ్చున్నారు, మధ్యవర్తిత్వం ద్వారా సమయము ఆదా అవుతుందని, ఎటువంటి డబ్బు పెట్టవలసిన అవసరం లేదని, మధ్యవర్తిత్వం ద్వారా పరిష్కారమైన వ్యాజ్యాలలో న్యాయస్థానానికి చెల్లించిన రుసుము సెక్షన్ 66 (ఎ) ఆంధ్రప్రదేశ్ న్యాయస్థానాల రుసుముల చట్టం క్రింద తిరిగి చెల్లించబడుతుందని తెలియజేశారు.ఈ అవకాశాన్ని కక్షిదారులు ఉపయోగించుకోవాలని తెలియజేశారు. అనంతరం గ్రామ ప్రజలకు మధ్యవర్తిత్వంనకు సంబంధించిన కరపత్రాలను పంపిణీ చేశారు ఈ కార్యక్రమంలో పారా లీగల్ వాలంటర్ అద్దంకి. మధుసూధనరావు, సంజీవరాయునిపేట విఆర్వో. బి. వెంకటేశ్వర్లు, తాళ్లపల్లి గ్రామ పెద్ద షేక్. హుస్సేన్ ఖాన్, ముండ్లపాడు పంచాయతీ సెక్రటరీ సుబ్బారావు ,ఆయా గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## నెమలిగుండ్ల రంగనాయక స్వామిని దర్శించుకున్న హిందూ ధార్మిక పరిషత్ చైర్మన్ దాసరి శ్రీనివాసులు

### భక్తుల తో కిటకిట లాటిన నెమలిగుండ్ల క్షేత్రం





**రాచర్ల, పెన్ పవర్ అక్టోబర్ 03**

రాచర్ల మండలం జేపీ చెరువు సమీపంలో నలమల్ల ప్రకృతి సోయగాల మద్య వెలసిన శ్రీ నెమలిగుండ్ల రంగనాయక స్వామి వారి దేవస్థానం లో శనివారం స్వామివారికి ఉదయం ఆలయ అర్చకులు 5 గంటలకు అభిషేకాది కార్యక్రమలు నిర్వహించి అనంతరం స్వామివారిని అలంకరించి భక్తుల దర్శనార్థం ఏర్పాటు చేశారు, స్వామివారిని దర్శించుకునేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. వచ్చిన భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు.స్వామివారిని హిందూ ధార్మిక పరిషత్ చైర్మన్ విశ్రాంత ఐ ఏ ఎస్ దాసరి శ్రీనివాసులు స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదములు స్వీకరించారు ఈ సందర్భంగా దాసరి శ్రీనివాసులు మాట్లాడుతూ దేవస్థానంలో వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు తన వంతు సహకరం అందజేస్తామని తెలియజేశారు . వచ్చే ఆదివారం 11 తేదీన గుండ్ల పరమేశ్వరం నుంచి మన దేవస్థానం దగ్గరకు వచ్చి గుండ్లకమ్మ నది పరివాహక ప్రాంతములు అన్నింటినీ కవర్ చేస్తూ యాత్ర నిర్వహించడానికి సిద్ధపడే భాగంగా రూట్ మ్యాప్ కొరకు సందర్శించి ఉన్నారు సదరు కార్యక్రమమును ఆలయ పాలకమండలి చైర్మన్ సిద్ధం నరసింహులు పాలకమండలి సభ్యులు దేవస్థానం అర్చకులు సిబ్బంది నిర్వహించి ఉన్నారు సదరు కార్యక్రమాన్ని దేవస్థానం కార్యనిర్వహణ అధికారి నాగయ్య పర్యవేక్షించారు.

## రామాపురం రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేసిన టిడిపి నాయకులు

**సి.ఎస్.పురం,పెన్ పవర్ అక్టోబర్ 3**

మండలంలోని రామాపురం రోడ్డు అభివృద్ధికి సిఐయూ నిధులు రూ.2.72 కోట్లతో చేపట్టనున్న రహదారి నిర్మాణ పనులకు కనిగిరి శాసనసభ్యులు, ఒంగోలు పార్లమెంట్ టిడిపి అధ్యక్షులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి ఆదేశాల మేరకు మండల టిడిపి అధ్యక్షులు బొబ్బూరి రమేష్ మరియు టిడిపి నాయకులు భూమి పూజ చేశారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సి.ఎస్.పురం నుంచి కనిగిరి వెళ్లే ప్రధాన రహదారిలోని రామాపురం జంక్షన్ నుంచి రెడ్డిగారి కొత్తపల్లి వరకు రహదారి నిర్మాణాన్ని చేపట్టనున్నట్లు నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా టిడిపి నాయకులు మాట్లాడుతూ ఈ పనుల్లో భాగంగా రెడ్డిగారిపల్లి, కొత్తపల్లి, రామాపురం గ్రామాల పరిధిలో సిమెంట్ రోడ్లు, మిగిలిన ప్రాంతాల్లో తారు రోడ్డు నిర్మాణం చేపట్టనున్నట్లు, గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల అభివృద్ధికి ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి ప్రత్యేకంగా దృష్టి సారిస్తున్నారని అన్నారు. ప్రజల రాకపోకలకు ఇబ్బందులు లేకుండా అవసరమైన ప్రాంతాల్లో రహదారుల అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఉపముఖ్యమంత్రి కొణిదల పవన్ కల్యాణ్ నాయకత్వం లో ఎన్డిఏ కూటమి ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తుందన్నారు కేంద్రంలోని ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వం రాష్ట్ర అభివృద్ధికి నిధులను కేటాయిస్తూ సహకరిస్తుందన్నారు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో గ్రామాల్లో



రహదారులు మౌలిక వసతుల అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని తెలిపారు ఈ సందర్భంగా రామాపురం జంక్షన్ నుండి రెడ్డి గారి కొత్తపల్లి వరకు రహదారి నిర్మాణం చేపట్టడంతో ఆయా గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు ఈ కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షులు బొబ్బూరి రమేష్, రాష్ట్ర కనీస వేతనాల సలహా మండలి సభ్యులు డాక్టర్ బొమ్మనబోయిన వెంకటేశ్వర్లు, సింగిల్ విండో అధ్యక్షులు చెరుకుపల్లి వెంకటరెడ్డి, మాజీ సింగిల్ విండో చైర్మన్ బోయళ్ళ నారాయణరెడ్డి, టిడిపి సీనియర్ నాయకులు నాగిశెట్టి చిన్న మాలకొండయ్య, అట్లూరి రామకృష్ణంరాజు, మైనార్టీ సెల్ అధ్యక్షులు కూటగుళ్ల మహబూబ్ బాషా, కోనంగి వెంకటకొండయ్య, చావా చంద్రశేఖర్, మన్నేపల్లి కార్తీక్, వల్లపుశెట్టి వెంకటనారాయణ టిడిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## నూతన డీఎస్పీని కలిసిన బీజేపీ జిల్లా అధ్యక్షులు కృష్ణరావు



**మార్కాపురం పెన్ పవర్ అక్టోబర్ 03**

నూతనంగా బాధ్యతలు స్వీకరించిన మార్కాపురం డీఎస్పీ నిమ్మగడ్డ సత్యనారాయణను మార్కాపురం జిల్లా బీజేపీ అధ్యక్షులు పి.వి. కృష్ణారావు శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా డీఎస్పీని శాలువాతో సత్కరించి, దేశవ్యాప్తంగా ప్రసిద్ధిగాంచిన మార్కాపురం పలకలను బహూకరించారు.అనంతరం జిల్లాలోని పలు సమస్యలను డీఎస్పీ దృష్టికి తీసుకెళ్లారు. ముఖ్యంగా మార్కాపురం పట్టణంలో రోజురోజుకూ పెరుగుతున్న ట్రాఫిక్ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు. ప్రధాన రహదారుల్లో వాహనాల రద్దీని నియంత్రించేందుకు అవసరమైన ప్రాంతాల్లో వన్‌వే విధానాన్ని అమలు చేయడంతో పాటు ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.వాహనదారులు, వ్యాపారులు, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ట్రాఫిక్ క్రమబద్ధీకరణపై ప్రత్యేక దృష్టి సారించాలని కృష్ణారావు కోరారు. ప్రజల సమస్యలను దృష్టిలో ఉంచుకుని పోలీసు శాఖ తరఫున అవసరమైన చర్యలు తీసుకుంటామని డీఎస్పీ నిమ్మగడ్డ సత్యనారాయణ హామీ ఇచ్చినట్లు తెలిపారు. డీఎస్పీ ని కలిసిన వారిలో బిజెపి నాయకులు మండ్ల శివప్రసాద్, ఎస్. ప్రవీణ్,ఎక్కని కమల్ గుప్తా తదితరులు పాల్గొన్నారు.

## కదిరి హనుమంతరావు అకాలమరణం బాధాకరం- కదిరి బ్రదర్స్



**సి ఎస్ పురం, పెన్ పవర్ అక్టోబర్ 3**

కనిగిరి మండలంలోని వంగపాడు గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ కదిరి హనుమంతరావు అకాలమరణం బాధాకరమని కదిరి బాబురావు వ్యవసాయ కళాశాల చైర్మన్ కె.వి. ప్రకాశ్ రావు, సెక్రటరీ కరెస్పాండంట్ కదిరి పార్ధసారధి అన్నారు. శనివారం వంగపాడు గ్రామంలో హనుమంతరావు భౌతికాయాన్ని సందర్శించి పూలమాల వేసి నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా అయన కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. హనుమంతరావు పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని అయన కుటుంబ సభ్యులకు మనోధైర్యం కల్పించాలని భగవంతుణ్ణి ప్యార్థిస్తున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమం లో కదిరి పిచ్చయ్య నాయుడు, కదిరి కృష్ణ, మధు, తదితరులు ఉన్నారు.

## వృద్ధులకు బట్టలు పంపిణీ



**ఒంగోలు కల్చరల్, పెన్ పవర్ అక్టోబర్ 03**

ఒంగోలులోని ఉమామహేశ్వర జూనియర్ కాలేజీ కరస్పాండెంట్ చిలుకూరి జయలక్ష్మి 71 వ జన్మదినం సందర్భంగా సమతా మహిళా వృద్ధాశ్రమంలో చీరలు పంపిణీ చేశారు. శివప్రసాద్ కాలనీలో ఉన్న సమత మహిళా వృద్ధాశ్రమంలో 30 మందికి చీరలు, పండ్లు తో పాటు ఆశ్రమానికి కావాల్సిన ఫ్యాన్లు అందజేశారు. కాలేజీ కరస్పాండెంట్ జయలక్ష్మి పుట్టిన రోజు వేడుకలు ఆశ్రమంలోని వృద్దులతో కలిసి కాలేజీ సిబ్బంది చేశారు. మహిళా వృద్ధాశ్రమానికి తమ కాలేజీ తరపున అండగా ఉంటామని డైరెక్టర్ చిలుకూరి మల్లేశ్వరరావు తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ మోపర్తి లక్ష్మీనారాయణ, ఆశ్రమ నిర్వాహకులు అంకబాబు, మాలతి పాల్గొన్నారు.

## రైతు సేవాకేంద్రలో 35 శాతం సబ్సిడీ పై బయోమెట్రిక్ విధానంలో శనగ విత్తనాలకు ఈనెల 5 నుండి రిజిస్ట్రేషన్

### మండల వ్యవసాయాధికారి విజయ భాస్కర్ రెడ్డి





**గిద్దలూరు పెన్ పవర్ అక్టోబర్ 03**

రైతు సేవా కేంద్రాల్లో 35 శాతం సబ్సిడీ పై బయోమెట్రిక్ విధానంలో శనగ విత్తనాల రిజిస్ట్రేషన్ కార్యక్రమం ఈ నెల 5 వతేదీ నుండి జరుగుతుందని., శనగ పంట వేసే ప్రతి ఒక్క రైతు మీ రైతు సేవాకేంద్రం లోని గ్రామ వ్యవసాయ సహాయకులను సంప్రదించి శనగ విత్తనాలకొరకు రిజిస్ట్రేషన్ చేయించుకొని సంబంధిత అమౌంట్ జమ చేయాలని,. శనగ విత్తనాలు కావలసిన రైతులు పట్టదారు పాసుబుక్, ఆధార్ కార్డు, మొబైల్ నంబర్ తీసుకొని రైతు సేవాకేంద్రానికి రావలెనని,.ఒక్కొక్క ఎకరాకి 40 కేజీలు చొప్పున 5 ఎకరాల వరకు విత్తనాలు ఇవ్వబడుతుందన్నారు. జే.జి -11 రకం ఢకాక్-2 రకం అందుబాటులో ఉన్నాయన్నారు. వీటి పూర్తి ఖరీదు. క్వింటా రూ. 9000/- సబ్సిడీ రూ. 3150/-, రైతు కట్టవలసిన మొత్తం క్వింటాకి రూ. 5850/-అన్నారు.

## స్వచ్ఛ ఆంధ్ర జిల్లా ఉత్తమ వైద్యశాలగా అరివేముల

**సి ఎస్ పురం, పెన్ పవర్ అక్టోబర్ 3**

2026 సంవత్సరం జిల్లా స్థాయి స్వచ్ఛ ఆంధ్ర అవార్డులలో భాగంగా మండలంలోని అరివేముల గ్రామంలోని ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాల జిల్లా స్థాయిలో ఉత్తమ వైద్యశాలగా అవార్డు ప్రకటించారు ఈ అవార్డును వైద్యశాల వైద్యాధికారి పుండరీ కాంక్ష రావు గాంధీ జయంతి సందర్భంగా ఒంగోలులోని ఎన్టీఆర్ కళాక్షేత్రంలో జరిగిన స్వచ్ఛ ఆంధ్ర అవార్డు ప్రధానోత్సవ కార్యక్రమంలో జిల్లా మంత్రివర్యులు డోలా బాల వీరాంజనేయ స్వామి ఒంగోలు శాసనసభ్యులు దామచర్ల జనార్దన్ రావు ఉమ్మడి ప్రకాశంజిల్లా కలెక్టర్ రాంబాబు చేతులమీదుగా శుక్రవారం అవార్డు అందుకున్నారు తాను వైద్యాధికారిగా పనిచేస్తున్న కాలంలో జరిగిన అభివృద్ధికి స్వచ్ఛ ఆంధ్ర అవార్డు రావడం చాలా సంతోషంగా ఉందని వైద్యాధికారి పుండరీకాంక్షరావు తెలిపారు వైద్యశాలను మరింత అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తారని ఈ సందర్భంగా వారు తెలిపారు.



# అర్ధవీడు మండల అభివృద్ధికి మరో ముందడుగు

## రూ.7 కోట్ల అంచనా వ్యయంతో రోడ్లు, బ్రిడ్జి, సీసీ రోడ్లు, నిర్మాణ పనులకు భూమిపూజ

## ప్రజలకు మెరుగైన రవాణా, మౌలిక వసతులు కల్పించడమే లక్ష్యం: ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి

**అర్ధవీడు, పెన్ పవర్, అక్టోబర్ 3**

గిద్దలూరు నియోజకవర్గంలో గ్రామీణ మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తూ అర్ధవీడు మండలంలో పలు కీలక అభివృద్ధి పనులకు గిద్దలూరు శాసనసభ్యులు ముత్తుముల అశోక్ రెడ్డి శనివారం భూమిపూజ చేసి పనులకు శ్రీకారం చుట్టారు. పల్లె పండుగ--3.0లో భాగంగా చేపడుతున్న ఈ పనులు పూర్తయితే అర్ధవీడు మండలంలోని పలు గ్రామాల ప్రజలకు రవాణా సౌకర్యం, అంతర్గత రహదారులు, సామాజిక మౌలిక వసతులు మరింత మెరుగుపడనున్నాయి. ముఖ్యంగా అర్ధవీడు - అచ్చంపేట మధ్య రహదారి మరియు బ్రిడ్జి నిర్మాణం పూర్తయితే ప్రజల రాకపోకలకు మరింత సౌకర్యం కలగనుంది.

**అర్ధవీడు--అచ్చంపేట రహదారి మరియు బ్రిడ్జి నిర్మాణం**

అర్ధవీడు నుంచి అచ్చంపేటకు అనుసంధానించే తారు రోడ్డు మరియు బ్రిడ్జి నిర్మాణానికి రూ.3.70 కోట్ల అంచనా వ్యయంతో పనులు చేపట్టనున్నారు. ఈ నిర్మాణం ద్వారా ఆయా ప్రాంతాల మధ్య రవాణా సౌకర్యం మెరుగుపడటంతో పాటు ప్రజలు, రైతులు, విద్యార్థులు మరియు ఇతర ప్రయాణికులకు ప్రయోజనం కలగనుంది. మండల కేంద్రంలోని అంతర్గత రహదారులను అభివృద్ధి చేసేందుకు రూ.50 లక్షల అంచనా వ్యయంతో సీసీ రోడ్ల నిర్మాణ పనులు చేపట్టనున్నారు. దీనివల్ల స్థానిక ప్రజలకు మెరుగైన రహదారి సౌకర్యం అందుబాటులోకి రానుంది. బసిరెడ్డిపల్లి నుంచి మాగుటూరు తండా వరకు తారు రోడ్డు నిర్మాణానికి రూ.2.20 కోట్ల అంచనా వ్యయంతో పనులు చేపట్టనున్నారు. గ్రామీణ ప్రాంతాలకు మెరుగైన రహదారి అనుసంధానం కల్పించడంలో ఈ



రహదారి కీలకంగా ఉండనుంది.

**మొత్తం రూ.7 కోట్ల అభివృద్ధి పనులు**

అర్ధవీడు మండలంలో ఈ రోజు భూమిపూజ చేసిన నాలుగు ప్రధాన అభివృద్ధి పనులకు కలిపి రూ.7 కోట్ల అంచనా వ్యయం ఉంది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి మాట్లాడుతూ, నియోజకవర్గంలోని ప్రతి ప్రాంతానికి అవసరమైన మౌలిక వసతులను దశలవారీగా అభివృద్ధి చేయడంపై దృష్టి సారిస్తున్నట్లు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో రహదారులు, బ్రిడ్జిలు, అంతర్గత సీసీ రోడ్లు, సామాజిక మౌలిక వసతులు ప్రజల దైనందిన జీవితంతో నేరుగా ముడిపడి ఉన్నాయని, అందువల్ల ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు పేర్కొన్నారు. అభివృద్ధి పనులు నిర్ణీత ప్రమాణాలకు



అనుగుణంగా, నాణ్యతతో మరియు సాధ్యమైనంత త్వరగా పూర్తయ్యేలా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. అర్ధవీడు మండలంలో చేపడుతున్న ఈ అభివృద్ధి పనులు పూర్తయిన అనంతరం రహదారి అనుసంధానం మెరుగుపడటంతో పాటు గ్రామీణ ప్రాంతాల ప్రజలకు రాకపోకలు సులభతరం కానున్నాయి. అంతర్గత సీసీ రోడ్ల నిర్మాణంతో మండల కేంద్రంలోని రహదారి సౌకర్యాలు మెరుగుపడనున్నాయి. షాదీఖానా నిర్మాణంతో స్థానిక ప్రజలకు అదనపు సామాజిక మౌలిక వసతి అందుబాటులోకి రానుంది. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు, మండల ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, గ్రామస్థులు మరియు ప్రజలు పాల్గొన్నారు.

# బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలి

**ఆర్ సి ఇంచార్జి యర్రగొండపాలెం పెన్ పవర్ అక్టోబర్ 3**



బీసీలకు స్థానిక సంస్థల్లో 50 శాతం రిజర్వేషన్లు కల్పించి, వాటికి రాజ్యాంగంలోని 9వ షెడ్యూల్ ద్వారా చట్టబద్ధత కల్పించాలని బహుజన్ సమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షుడు రాచేటి ప్రసాదరావు రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. స్థానిక సంస్థల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని గతంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు హామీ ఇచ్చారని రాచేటి ప్రసాదరావు పేర్కొన్నారు. 2012లో ప్రకటించిన బీసీ డిక్లరేషన్, 2014 ఎన్నికల మేనిఫెస్టోలోనూ ఈ అంశాన్ని ప్రస్తావించారని గుర్తుచేశారు. హామీ మేరకు బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని కోరారు. రాష్ట్రంలో, కేంద్రంలో ఎన్డీఏ కూటమి ప్రభుత్వాలు ఉన్నందున కేంద్ర ప్రభుత్వాన్ని ఒప్పించి బీసీలకు 50 శాతం రిజర్వేషన్లకు రాజ్యాంగపరమైన రక్షణ కల్పించాలని బీఎస్పీ డిమాండ్ చేసింది. 50 శాతం రిజర్వేషన్లను 9వ షెడ్యూల్‌లో చేర్చేలా చర్యలు తీసుకోవాలని కోరింది. ప్రస్తుతం బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పించడంపై ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం సరిపోదని బీఎస్పీ పేర్కొంది. బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తేనే రాజకీయ ప్రాతినిధ్యం మరింత విస్తృతమవుతుందని తెలిపింది. 50 శాతం రిజర్వేషన్లు అమలు చేయకుండా స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహిస్తే బీసీలకు అన్యాయం జరుగుతుందని అన్నారు.

# వన్యప్రాణి వారోత్సవాలలో పాల్గొన్న ఎమ్మెల్యే ముత్తుముల





**అర్ధవీడు, పెన్ పవర్, అక్టోబర్ 3**

అర్ధవిడు మండలం మాగుటూరు గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆంధ్రప్రదేశ్ అటవీశాఖ - ప్రాజెక్ట్ డైరెక్టర్, మార్కాపురం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వన్యప్రాణి వారోత్సవాలు - 2026 కార్యక్రమంలో ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి శనివారం పాల్గొని మొక్కలు నాటడం జరిగింది. అనంతరం అటవీశాఖ అధికారులు ఎమ్మెల్యేకు మన డివిజన్ లోని పులులు వాటి సంచారం గుర్తింపు వాటి కదలికలకు ఉపయోగించే హై టెక్ కెమెరాలు, వాటి పనితీరు, వన్యప్రాణుల సంరక్షణ గురించి వివరించారు. చివరగా అటవీశాఖ అధికారులు ఎమ్మెల్యే అశోక్ రెడ్డి ను శాలువా, పూల మాలతో ఘనంగా సన్మానించారు.

# 8వ తేదీన యర్రగొండపాలెంలో మందకృష్ణ పర్యటన

### ఎమ్మార్పీఎస్ జిల్లా అధికార ప్రతినిధి గర్నపూడి వినయ్



**ఆర్ సి ఇంచార్జి యర్రగొండపాలెం పెన్ పవర్ అక్టోబర్ 3**

సింగరాయకొండలో ఇటీవల జరిగిన షేక్ తౌశిక్, ఆయన తల్లి మౌలాబి హత్యలపై సీబీఐ విచారణ కోరుతూ అక్టోబర్ 12న నిర్వహించనున్న మహాధర్నాకు సమాయత్తంగా ఈ నెల 8న యర్రగొండపాలెంలో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించనున్నట్లు ఎమ్మార్పీఎస్ జిల్లా అధికార ప్రతినిధి గర్నపూడి వినయ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు చెందిన నాయకులు, కుల పెద్దలు సమావేశానికి హాజరుకావాలని పిలుపునిచ్చారు. ముస్లిం మైనార్టీ నాయకులు, ఎమ్మార్పీఎస్ నాయకులు, కార్యకర్తలు, బీసీ సంఘాల ప్రతినిధులు, మాల మహానాడు నాయకులు, సీపీఐ, సీపీఎం నాయకులు పాల్గొనాలని కోరారు. అక్టోబర్ 8న మధ్యాహ్నం 2 గంటలకు యర్రగొండపాలెంలో రౌండ్‌టేబుల్ సమావేశం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమానికి పద్మశ్రీ మందకృష్ణ మాదిగ ముఖ్య అతిథిగా హాజరవుతారని చెప్పారు. సింగరాయకొండ ఘటనలో బాధిత కుటుంబానికి న్యాయం జరిగే వరకు వివిధ సామాజిక సంఘాలు, రాజకీయ పార్టీలు తమ వంతు కృషి చేయాలని వినయ్ కోరారు. అక్టోబర్ 12న చేపట్టనున్న మహాధర్నాను విజయవంతం చేసేందుకు 8న జరిగే సమాయత్త సమావేశంలో అన్ని వర్గాల ప్రతినిధులు పాల్గొని తమ అభిప్రాయాలను వెల్లడించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# ప్రభుత్వ భూములను ప్రజల అవసరాలకు ఉపయోగించాలి



**సి ఎస్ పురం, పెన్ పవర్ అక్టోబర్ 3**

మండల కేంద్రమైన సి ఎస్ పురం లో ఉన్న ప్రభుత్వ భూములు స్థలాలు ప్రజలకు అవసరమైన, ఉపయోగకరమైన పనులకు ఉపయోగించాలని సిపిఎం పార్టీ నాయకులు తహశీల్దార్ ధర్మ తేజను కోరారు. సిపిఎం పార్టీ జిల్లా కమిటీ సభ్యులు ఊసా వెంకటేశ్వర్లు, పలువురు నాయకులు శనివారం తహసిల్దార్ ధర్మతేజను కలిశారు. సి ఎస్ పురం లో ఉన్న విలువైన ప్రభుత్వ భూములు, స్థలాలు అనేక సంవత్సరాల నుంచి అన్యాక్రాంతమై అనర్హుల చేతులలోకి పోతున్నవని, పంచాయతీ ప్రజల ఆస్తి అయిన భూములు కొంతమంది ఆక్రమించుకుని అమ్ముకుని సొమ్ము చేసుకుంటున్నట్లు తెలిపారు. పంచాయతీ పాలకులు గానీ అధికారులు గానీ ఈ అక్రమాలను నియంత్రించడంలో నిర్లక్ష్యం చేస్తున్నారన్నారు. ప్రస్తుతం మండల పరిధిలో నిర్మిస్తున్న రెండు నేషనల్ హైవే రోడ్లకు చాలా స్థలాలు కేటాయించాల్సి వచ్చిందన్నారు. ఇలాంటి కారణాలతో మండల కేంద్రంలోని ప్రభుత్వ భూములన్నీ కరిగిపోతున్నాయని దీంతో ప్రజల భవిష్యత్తు ప్రశ్నార్ధకంగా మారిందన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని 30 పడకల ఆసుపత్రి నిర్మాణం కోసం ప్రస్తుతం వైద్యశాల ప్రక్కన ఉన్న స్థలాన్ని కేటాయించాలని, అలాగే క్రీడా మైదానం, ఇండోర్ స్టేడియం, పార్క్ ఏర్పాటు, వివిధ కమ్యూనిటీలకు కమ్యూనిటీ హాల్స్ నిర్మాణం కొరకు, పండుగల సందర్భంగా ప్రజలు వనభోజనాలు ఏర్పాటు చేసుకోవడానికి తదితర ప్రజలకు ఉపయోగపడే అవసరమైన పనుల కోసం ప్రభుత్వ స్థలాలను కేటాయించాలని ఆయన కోరారు కోరారు. ఆ మేరకు సిపిఎం పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు ఊసా వెంకటేశ్వర్లు, గుర్రం లక్ష్మయ్య, ఇర్ల మోహన్ వినతిపత్రాన్ని తహసిల్దార్ ధర్మతేజకు అందజేశారు

# మొండివారిపాలెం అంగన్వాడీలో పోషకాహార ఉత్సవాలు



**గుడ్లూరు, పెన్ పవర్, అక్టోబరు 03**

ఉలవపాడు ప్రాజెక్టు సీడీపీఓ మాధవీలత ఆదేశాలు మేరకు మండలంలోని తెట్టు సెక్టార్ లోని మొండివారిపాలెం గ్రామంలో అంగన్వాడి సెంటర్ నందు 9వ పోషక ఆహార ఉత్సవాలు సూపర్వైజర్ కె.కామేశ్వరి ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన గర్భవతులు, బాలింతలు, కిషోర్ బాలికలు ఇతర తల్లులకు పౌష్టికాహారం గురించి సూపర్వైజర్ తెలియజేశారు. అదేవిధంగా మనం తీసుకునే ఆహారంలో ఆకుకూరలు, కాయగూరలు, పండ్లు, పాలు, పాలు, పదార్థాలు, చిరుధాన్యాలు, సజ్జలు, రాగులు, జొన్నలు, క్యారెట్లు, బీట్రూట్, మునగాకు, కరివేపాకు వంటివి ఎక్కువగా వాడుకోవాలన్నారు. ఆహారంలో ప్రోటీన్ ఎక్కువగా ఉండే ఆహార పదార్థాలు తీసుకోవాలని తెలియజేశారు. ప్రాంతీయ వంటకాలు ఆరోగ్యకరమైన ఆహార అలవాట్లపై అవగాహన కల్పించటమైనదని తెలిపారు. సెంటర్లో తాజాగా భోజనం భాగస్వామ్యం మరియు బాధ్యత పోషణ మరియు బాల ప్రేరణ ప్రధానమంత్రి మాతృ వందన యోజన ఈ విషయంపై తల్లులకు తెలియజేయడమైనదన్నారు. ఈ కార్యక్రమానికి స్కూల్ హెచ్ఎం ప్రసాద్, టీచర్ గంగాభవాని, ఆశ అనురాధ, కార్యకర్తలు అలివేలు, జి.మౌనిక తదితరులు పాల్గొన్నారు.

# మత్తు పదార్థాలకు దూరంగా ఉండండి

## విద్యార్థులకు పోలీసుల పిలుపు -పట్టణంలో పోలీసు అవగాహన ర్యాలీ

**మార్కాపురం పెన్ పవర్ అక్టోబర్ 03**

మార్కాపురం జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన మత్తు పదార్థాల నిర్మూలన, రహదారి భద్రత, మహిళల భద్రతపై అవగాహన ర్యాలీ ఘనంగా జరిగింది. మార్కాపురం పట్టణంలో శనివారం సాయంత్రం ఈ ర్యాలీని నిర్వహించారు. మార్కాపురం ఓఎస్డీ నవజ్యోత్ మిశ్రా, మార్కాపురం ఎస్డీపీఓ నిమ్మగడ్డ సత్యనారాయణ ఆధ్వర్యంలో ఈ ర్యాలీ సాగింది. మార్కాపురం పోలీస్ స్టేషన్ నుండి ప్రారంభమైన ఈ ర్యాలీ ప్రధాన వీధుల మీదుగా ఆర్టీసీ బస్టాండ్ వరకు కొనసాగింది. ఈ ర్యాలీలో సుమారు 200 మంది పోలీసు అధికారులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు చేతుల్లో ప్లకార్డులు పట్టుకుని నినాదాలు చేస్తూ ప్రజల్లో చైతన్యం కల్పించారు. మత్తు పదార్థాల వల్ల కలిగే దుష్పరిణామాలు, రహదారి ప్రమాదాల నివారణకు హెల్మెట్ ధరించడం, ట్రాఫిక్ నిబంధనలు పాటించడం, మహిళల భద్రత కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఓఎస్డీ నవజ్యోత్ మిశ్రా మాట్లాడుతూ యువత మత్తు



పదార్థాలకు దూరంగా ఉండాలని, తమ బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని పిలుపునిచ్చారు. రహదారి భద్రతా నియమాలు పాటించి ప్రాణాలను కాపాడుకోవాలని, మహిళల పట్ల గౌరవంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సి ఐ అల్తాఫ్ హుస్సేన్, ఎస్ఐ విశ్వనాథ్ రెడ్డి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండాలి -ఎస్సై వెంకటేశ్వరరెడ్డి



**సి ఎస్ పురం, పెన్ పవర్ అక్టోబర్ 3**

విద్యార్థి దశ నుంచే చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని ఎస్సై వెంకటేశ్వరరెడ్డి అన్నారు మండలంలోని అంబవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు షేక్ షరీఫ్ ఆధ్వర్యంలో శనివారం విద్యార్థులకు ప్రభుత్వ చట్టాలు, సామాజిక అంశాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై వెంకటేశ్వరరెడ్డి విద్యార్థులతో మాట్లాడుతూ పొగాకు వినియోగం, డ్రగ్స్ కు అలవాటు పడటం, మైనర్లు వాహనాలు నడపడం, బాల్యవివాహాలు వంటి అంశాలపై విద్యార్థులకు వివరించారు. చిన్న వయసులో చెడు అలవాట్లకు బానిస కావడం వల్ల భవిష్యత్తులో ఎదురయ్యే ఇబ్బందులను వివరించి, వాటికి పూర్తిగా దూరంగా ఉండాలని సూచించారు. మైనర్ల డ్రైవింగ్, బాల్యవివాహాలు తదితర అంశాలకు సంబంధించి చట్టపరమైన నిబంధనలు ఉన్నాయని, వాటిని ప్రతి ఒక్కరూ పాటించాలన్నారు విద్యార్థులు తమ హక్కులు, బాధ్యతలపై అవగాహన కలిగి ఉండటంతో పాటు చుట్టుపక్కల సమాజంలో జరిగే అసాంఘిక కార్యకలాపాలపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. చదువుతో పాటు మంచి నడవడి, క్రమశిక్షణ అలవర్చుకోవడం ద్వారా ఉన్నత భవిష్యత్తును నిర్మించుకోవచ్చని అన్నారు అనంతరం రాష్ట్ర మానవ హక్కుల సంఘం అధ్యక్షులు డాక్టర్ షేక్ గౌస్ విద్యార్థినులతో మాట్లాడుతూ గుడ్ టచ్, బ్యాడ్ టచ్ గురించి సందేశాన్ని ఇచ్చారు విద్యార్థులు భవిష్యత్తులో ఉన్న స్థాయికి ఎదగాలంటే పాటించాల్సిన డోస్ అండ్ డోంట్స్ గురించి వివరిస్తూ అలవాట్లు సమయపాలన వంటి అంశాలకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు తదుపరి ఈగల్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన వివిధ పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసి విద్యార్థులకు అవగాహన కల్పించిన ఎస్సై వెంకటేశ్వరరెడ్డి కి , షేక్ గౌస్ కు పాఠశాల సిబ్బంది మరియు విద్యార్థులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

# రైతు సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యం..

## గోకులం షెడ్ల నిర్మాణ ప్రారంభోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే ముత్తుముల



**అర్ధవీడు, పెన్ పవర్, అక్టోబర్ 3**

అర్ధవీడు మండలంలోని మాగుటూరు గ్రామంలో విబి- జి గ్రామ్ - జి (వికసిత్ భారత్--గ్రామీణ్) పల్లె పండుగ 3.0 నిధులతో చేపట్టిన గోకులం షెడ్ నిర్మాణ పనులకు శనివారం గోకులం షెడ్ వద్ద శంకుస్థాపన చేసి, స్వయంగా పార పట్టి నిర్మాణ పనులను గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి ప్రారంభించారు. గ్రామీణ ప్రాంతాల్లో పశుపోషక రైతులకు అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం ఈ పనులను చేపడుతోందని తెలిపారు. కూటమి ప్రభుత్వం గ్రామీణాభివృద్ధి, రైతు సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇస్తూ పల్లె పండుగ 3.0 ద్వారా గ్రామాల్లో అభివృద్ధి పనులను వేగవంతం చేస్తోందని పేర్కొన్నారు. రైతులకు, పశుపోషకులకు ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకుంటూ, గ్రామాల సమగ్ర అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అర్ధవీడు మండల ప్రముఖులు, కూటమి నాయకులు, రైతులు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లపై దృష్టి సారించాలి - జిల్లా కలెక్టర్ రాజాబాబు





**ఒంగోలు కలెక్టరేట్, పెన్ పవర్ అక్టోబర్ 03**

స్థానిక ఎన్నికల నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లపై దృష్టి పెట్టాలని జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు అధికారులను ఆదేశించారు. ఈ దిశగా తీసుకోవాల్సిన చర్యలపై శనివారం సంబంధిత అధికారులతో ప్రకాశం భవనంలో ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. జిల్లాస్థాయి అధికారులను ప్రస్తుతం అన్ని మండలాలకు ప్రత్యేక అధికారులుగా నియమించినందున తమ పరిధిలోని పోలింగ్ కేంద్రాలలో అవసరమైన మౌలిక వసతుల కల్పనపై దృష్టి పెట్టాలన్నారు. ఇందుకోసం అన్ని పోలింగ్ కేంద్రాలను ప్రత్యక్షంగా పరిశీలించాలన్నారు. జిల్లాలో 27 జడ్పిటిసిలు, 373 ఎంపీటీసీలు, 517 గ్రామపంచాయతీలకు ఎన్నికలు జరిపించాల్సి ఉందన్నారు. ఎన్నికల కమిషన్ నుంచి రావాల్సిన సామగ్రి వచ్చినందున, స్థానికంగా సమకూర్చుకోవాల్సిన సామాగ్రి కోసం చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అదేవిధంగా, మున్సిపాలిటీల విషయంలో కందుకూరు మినహా ఇతర అన్ని మున్సిపాలిటీలో అవసరమైన చర్యలు ముమ్మరం చేయాలన్నారు. ఎన్నికల నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లు సమర్థంగా చేయడం ద్వారా ఈ ప్రక్రియను విజయవంతంగా సగం పూర్తి చేసినట్లు అవుతుందన్నారు. అందుకే రెగ్యులర్ విధులతోపాటు ఎన్నికల విధులకు కూడా సమాన ప్రాధాన్యం ఇవ్వాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో డిఆర్ఓ పి.వెంకటరమణ, జడ్పీ సీఈవో చిరంజీవి, డిపిఓ అనుపమ, మండలాల స్పెషల్ ఆఫీసర్లు, మునిసిపల్ కమిషనర్లు పాల్గొన్నారు.

# అర్ధవీడులో రూ.60 లక్షలతో షాదీఖానా నిర్మాణం

### ఎంపీ, ఎమ్మెల్యే నిధులతో పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే అశోక్ రెడ్డి



**అర్ధవీడు, పెన్ పవర్, అక్టోబర్ 3**

ఎన్నో సంవత్సరాలుగా పరిష్కారం కాని షాదీఖానా భవన నిర్మాణ సమస్యకు పరిష్కారం లభించింది. అర్ధవీడు గ్రామంలో సామాజిక అవసరాలకు ఉపయోగపడే షాదీఖానా భవన నిర్మాణానికి ఎంపీ నిధుల నుంచి రూ.30 లక్షలు, ఎమ్మెల్యే నిధుల నుంచి రూ.30 లక్షలు కలిపి మొత్తం రూ.60 లక్షల అంచనా వ్యయంతో చేపట్టనున్న నిర్మాణ పనులకు గౌ ఎమ్మెల్యే శ్రీ ముత్తుముల అశోక్ రెడ్డి గారు శంకుస్థాపన చేశారు. షాదీఖానా నిర్మాణం కోసం స్థానిక ముస్లిం మత పెద్దలు, మైనారిటీ నాయకులు ఎమ్మెల్యే గారిని కోరిన వెంటనే స్పందించి నిధులు మంజూరు చేయించి నిర్మాణానికి శ్రీకారం చుట్టడంపై హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ముస్లిం మత పెద్దలు, మైనారిటీ నాయకులు, స్థానిక కూటమి నాయకులు ఎమ్మెల్యే అశోక్ రెడ్డికు ప్రత్యేక దువా నిర్వహించి, శాలువా కప్పి, పూలమాలతో ఘనంగా సన్మానించారు. సామాజిక అవసరాలకు ఉపయోగపడే షాదీఖానా నిర్మాణంతో ప్రజలకు మరింత సౌకర్యం కలగనుందని వారు పేర్కొన్నారు.

# ఎస్ఎంసీ చైర్మన్లతో మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు భేటీ

### విజయం సాధించిన చైర్మన్లకు శాలువాతో సత్కారం

### స్థానిక ఎన్నికల్లో సమన్వయంతో పని చేయాలని పిలుపు



**మార్కాపురం పెన్ పవర్ అక్టోబర్ 03**

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తరపున ఎస్ఎంసీ ఎన్నికల్లో పోటీ చేసి చైర్మన్లుగా ఎన్నికైన నేతలు మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబుతో భేటీ అయ్యారు. మండలంలోని మంగలకుంట ఎస్ఎంసీ చైర్మన్ గుమ్మా ఏడుకొండలు, కొత్తూరు చైర్మన్ పిక్కిలి హుసేనయ్య, నాతనంపల్లె చైర్మన్ తంగిరాల కాశయ్య శనివారం మార్కాపురంలోని అన్నా రాంబాబు నివాసానికి వచ్చి మర్యాదపూర్వకంగా కలిశారు. తమ గెలుపునకు సహకరించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఎంసీ చైర్మన్లను అన్నా రాంబాబు శాలువా, పూలదండలతో సత్కరించి అభినందించారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కూడా నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. ఇదే స్ఫూర్తి, ఉత్సాహంతో పనిచేసి విజయం సాధించాలని ఆకాంక్షించారు.

# వై. పి. రంగయ్యకు ఘన సన్మానం

**గిద్దలూరు:పెన్ పవర్ అక్టోబర్ 03**

గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం రాష్ట్ర కోశాధికారిగా ఏకగ్రీవంగా నియమితులైన వై పి్ా. రంగయ్య ను తహశీల్దార్ అంజనేయరెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ వై పి రంగయ్య కు శుభాకాంక్షలు తెలియజేసి, ఉద్యోగుల సంక్షేమం , సంఘం అభివృద్ధికి మరింత కృషి చేయాలని ఆకాంక్షించారు. అనంతరం శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ ఏ. నాయబ్ హుస్సేన్, మండల సర్వేయర్ ఎమ్. ఆంజనేయులు, గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం జిల్లా ఉపాధ్యక్షులు అరిగేలా వెంకట రామయ్య, బి రాజశేఖర్ రెడ్డి, జి అచ్చయ్య, బి వెంకటేశ్వర్లు గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీరామ అజయ్ కుమార్, గ్రామ గ్రామ సర్వేయర్లు ఖాజావలి,



రాము, వినోద్, మురళి, గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం రాష్ట్ర కార్యదర్శి ఓ ఆంజనేయులు, అల్లూరయ్య సిబ్బంది పాల్గొన్నారు.

# గోకులం షెడ్ ప్రారంభోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే ముత్తుముల



**అర్ధవీడు, పెన్ పవర్, అక్టోబర్ 3**

అర్ధవీడు మండలం మాగుటూరు గ్రామంలో ఎర్రగుంట్ల కరీముల్లాకు మంజూరైన గోకులం షెడ్ నిర్మాణం పూర్తికావడంతో ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి పాల్గొని గోకులం షెడ్‌ను శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అశోక్ రెడ్డి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో పశుపోషణను ప్రోత్సహించడంతో పాటు రైతులు, పాడి రైతులకు అవసరమైన మౌలిక వసతులు కల్పించేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ప్రభుత్వ పథకాల ద్వారా అర్హులైన ప్రతి లబ్ధిదారుడికి ప్రయోజనం అందేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అధికారులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# పొదిలి పట్టణ అభివృద్ధి కోసం ప్రత్యేక దృష్టి

### మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి వెల్లడి



**మార్కాపురం, ఎన్ పవర్ అక్టోబర్ 03**

పొదిలి ప్రాంతం పట్ల ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని మార్కాపురం నియోజకవర్గ శాసనసభ్యులు కనుల నారాయణరెడ్డి చెప్పారు. శనివారం నా డు ఆయన పొదిలి పట్టణంలోని పలు ప్రాంతాల్లో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నారాయణరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలోనే కూటమి ప్రభుత్వంతోనే అభివృద్ధి అన్ని విధాలా సాధ్యపడుతుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం నాయకులు ముల్లా కుద్దూస్, షేక్. అల్లా బకాష్, తోపాటు నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# మాలకొండ ఆదాయం రూ. 7,23,228

**వలేటివారిపాలెం, పెన్ పవర్, అక్టోబర్ 03**

అయ్యవారి పల్లి పంచాయతీ పరిధిలోని మాలకొండ లో వెలిసియున్న శ్రీ మాల్యాద్రి లక్ష్మీనరసింహస్వామి వారికి శనివారం భక్తుల నుండి వివిధ రూపాల ద్వారా రూ 7, 23,228 ఆదాయం వచ్చినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి పి శ్రీనివాసులు రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. ఆలయ అర్చకులు గౌరి శంకర్, నృసింహ చార్యులు స్వామి వారిని అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. రేపు హుండీ లెక్కింపు సోమవారం ఉదయం 8 గంటలకు మాలకొండ పైన కల్యాణ మండపం వద్ద భక్తులచే సమర్పించబడిన కానుకలు మరియు మొక్కుబడుల హుండీ లెక్కింపు జరుగున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి పి శ్రీనివాసులు రెడ్డి తెలిపారు.

# అడవులు, వన్యప్రాణుల సంరక్షణపై అవగాహన

**గూడెంకొత్తవీధి, పెన్ పవర్, అక్టోబర్ 3:** వన్యప్రాణి వారోత్సవాల్లో భాగంగా ఆర్.వి. నగర్ రేంజ్ అటవీ శాఖ ఆధ్వర్యంలో జీకే వీధి దేరాలలోని ఏపీటీడబ్ల్యూఆర్ జూనియర్ కళాశాల (బాలికల)లో 'ఏఎస్ఆర్ అరణ్య' కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా అడవులు, వన్యప్రాణుల సంరక్షణ అంశంపై విద్యార్థులకు వక్తృత్వ పోటీ నిర్వహించారు. పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు, ప్రశంసా పత్రాలను అందజేశారు. ఆర్.వి. నగర్ ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ మణికృష్ణ విద్యార్థులకు కెరీర్ గైడెన్స్ అందించారు. విద్యార్థులు కష్టపడి చదివి భవిష్యత్తులో ఉన్నత లక్ష్యాలను సాధించాలని సూచించారు. అడవులు, వన్యప్రాణుల సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని, ప్రకృతి సంపదను కాపాడేందుకు విద్యార్థులు కూడా తమ వంతు పాత్ర పోషించాలని వివరించారు.ఈ



కార్యక్రమంలో డీఆర్వో కె. కృష్ణారావు, ఎఫ్ఎస్వోలు మహేష్, పుష్ప, ఎఫ్బీవోలు భూషణం, ఈశ్వర్, భద్రంతో పాటు అటవీ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

# పార్టీలకు అతీతంగా వ్యవహరిస్తారని ఆశిస్తున్నాం

### కొత్త ఎస్పీని కలిసి శుభాకాంక్షలు తెలిపిన గౌస్ మోహిద్దీన్

**మార్కాపుర. పెన్ పవర్ అక్టోబర్ 03**

జిల్లాలో శాంతి భద్రతల పరిరక్షణ కోసం పార్టీలకతీతంగా పనిచేస్తారని ఆశిస్తున్నట్లు నూతన ఎస్పీని కలిసిన వైసిపి మైనార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి సయ్యద్ గౌస్ మోహిద్దీన్ ఆశాభావం వ్యక్తం చేశారు. మార్కాపురం జిల్లా నూతన ఎస్పీగా బాధ్యతలు చేపట్టిన పంకజ్ కుమార్ మీనా కు ఆయన కలిసి శాలువా కప్పి శుభాకాంక్షలు తెలియజేశారు. న్యాయం కోసం పేద ప్రజలు అట్టడుగు వర్గాలు కన్నెత్తి చూసేది పోలీసు శాఖ వైపేనని ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారూ. అందుకే పోలీస్ శాఖ ఉన్నతాధికారులు పార్టీలకు అతీతంగా పనిచేస్తారని ఆయన వెల్లడించాడు. మీరు కూడా ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేస్తారని తమకు నమ్మకం ఉందని జిల్లా కొత్త ఎస్పీ పంకజ్ కుమార్ మీనా ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు. జిల్లా ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేసే మంచి అధికారిగా మీరు పేరు తెచ్చుకుంటారన్న నమ్మకం తమకు జిల్లా ప్రజలకు ఉందని ఆయన ఈ సందర్భంగా వెల్లడించారు.




# ప్రజారక్షణ ధ్యేయంగా పోలీసులు పని చేయాలి

### జిల్లా ఎస్పీ పంకజ్ కుమార్ మీనా

**పొదిలి, పెన్ పవర్, అక్టోబర్ 3**

ప్రజారక్షణ ప్రధాన ధ్యేయంగా పోలీసులు పనిచేయాలని జిల్లా పోలీసు సూపర్ ఇంటెండెంట్ పంకజ్ కుమార్ మీనా చెప్పారు. శనివారం నాడు ఆయన స్థానిక పోలీస్ స్టేషన్ను అకస్మిక తనిఖీ జరిపారు. ఈ సందర్భంగా సిబ్బందికి అవసరమైన సలహాలు సూచనలు అందించారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల దృష్ట్యా సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించాలని, ఎటువంటి క్లిష్ట పరిస్థితులు ఎదురైనా, వాటిని ఉన్నత అధికారుల దృష్టి తీసుకుని వెళ్లాలని ఎస్పి మీనా సూచించారు. ఈ కార్యక్రమంలో పొదిలి పోలీస్ అధికారులతో పాటు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# మండల స్థాయిలో సమావేశాలు



### అనంతరమే అభ్యర్థులు ఎంపిక చేసుకుందాం

### పాడేరు నియోజక వర్గం తెదేపా ఇంచార్జ్ గిడ్డి ఈశ్వరి

**పాడేరు పెన్ పవర్:అక్టోబర్ 03:** నియోజకవర్గ స్థాయి కూటమి పార్టీల సమన్వయ సమావేశాలు తరహాలోప్రతి మండల స్థాయిలోనూ సమావేశాలు నిర్వహించుకున్న తర్వాత మాత్రమే ఎంపీటీసీ, జడ్పిటిసి స్థానాలకు పోటీ చేసే అభ్యర్థులు ఎంపికను పూర్తి చేద్దామని తెలుగుదేశం పార్టీ పాడేరు నియోజకవర్గ ఇన్చార్జి , మాజీ శాసన సభ్యురాలు గిడ్డి ఈశ్వరి స్పష్టం చేశారు పాడేరులోని శనివారం శంకరన్ ఆడిటోరియంలో తెలుగుదేశం పార్టీ బిజెపి, జనసేన పార్టీల నాయకుల సమన్వయ కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో గిడ్డి ఈశ్వరి పాల్గొని కూటమి నేతలు కార్యకర్తలను ఉద్దేశిస్తూ మాట్లాడుతూ.... అధిష్టానం సూచనలతో పాటు మనపై కూడా ఒత్తిడి తగ్గించాలనే ఆలోచనతో తాను ఒక సూచన చేస్తున్నానని ఈరోజు నియోజకవర్గ స్థాయిలో జరిగేటువంటి సమావేశాలు తరహాలో మండల స్థాయిలో కూడా అన్ని పార్టీ శ్రేణులతో నిర్వహించిన తర్వాత మాత్రమే అభ్యర్థులను ఎంపిక చేసుకుంటే అంత సజావుగా సాగుతుందని ఆమె అన్నారు. ఇది అందరికీ ఆమోదయోగ్యమైతే ముందుకు వెళ్లాలని సూచించారు. ఏ పార్టీ నుంచి అభ్యర్థి అయిన గెలుపు కోసం అందరూ ఐక్యంగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. కూటమి అభ్యర్థి గెలుపే లక్ష్యంగా అన్ని పార్టీలు ఐక్యంగా పనిచేస్తే శతశాతం విజయం సాధ్యమవుతుందని అన్నారు. గిరిజన ప్రాంతంలో కూటమి పోటీ చేసిన ప్రతి స్థానంలో గెలిచేందుకు ఈ రోజు అవకాశం ఉందని చెప్పారు. అభ్యర్థుల ఎంపిక పూర్తయిన తర్వాత గెలుపే ప్రధానంగా అడుగులు వేయాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ తరఫున ఆంధ్రప్రదేశ్ జానపద కళలు సృజనాత్మకత అకాడమీ చైర్మన్ డాక్టర్ వంపూరు. గంగులయ్య , బిజెపి తరఫున ఆ పార్టీ జిల్లా అధ్యక్షులు మఠం శాంత కుమారి, ఇతర కూటమి పార్టీ నాయకులు, కార్యకర్తలు హాజరయ్యారు.

## ఆసియా క్రీడలు: హాకీలోనూ ‘డబుల్ గోల్డ్’.. పురుషుల స్వర్ణం కూడా భారత్ కైవసం

- ఆసియా క్రీడల హాకీలో భారత్‌కు స్వర్ణ పతకం
- ఫైనల్‌లో మలేషియాపై 5-1 తేడాతో ఘన విజయం
- తొలిసారి పురుషులు, మహిళల జట్లు రెండూ స్వర్ణం సాధించి రికార్డు
- ఈ విజయంతో లాస్ ఏంజిల్స్ 2028 ఒలింపిక్స్‌కు నేరుగా అర్హత



ఆసియా క్రీడల హాకీలో భారత పురుషుల జట్టు పసిడి విజేతగా అవతరించింది. శనివారం జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో మలేషియాను 5–1 గోల్స్ తేడాతో చిత్తు చేసి స్వర్ణ పతకాన్ని ముద్దాడింది. ఈ విజయంతో భారత జట్టు వరుసగా రెండోసారి ఆసియా క్రీడల్లో స్వర్ణం గెలిచిన జట్టుగా నిలవడమే కాకుండా, లాస్ ఏంజిల్స్ వేదికగా 2028లో జరిగే ఒలింపిక్స్‌కు నేరుగా అర్హత సాధించింది. ఆసియా క్రీడల చరిత్రలో భారత పురుషుల హాకీ జట్టుకు ఇది ఐదో స్వర్ణం కావడం విశేషం.జపాన్‌లోని గిఫు ప్రిఫెక్చురల్ గ్రీన్ స్టేడియంలో జరిగిన ఈ ఫైనల్ మ్యాచ్‌లో భారత్ పూర్తి ఆధిపత్యం చెలాయించింది. ఆట 11వ నిమిషంలోనే కెప్టెన్ హర్మన్‌ప్రీత్ సింగ్ పెనాల్టీ కార్నర్‌ను గోల్‌గా మలిచి జట్టుకు ఆధిక్యాన్ని అందించాడు. అయితే, 14వ నిమిషంలో మలేషియా ఆటగాడు షెల్లో సిల్వేరియస్ ఫీల్డ్ గోల్ చేసి స్కోరును 1–1తో సమం చేశాడు. దీంతో మ్యాచ్ ఆసక్తికరంగా మారింది. కానీ, ఆ తర్వాత భారత ఆటగాళ్లు మలేషియాకు ఎలాంటి అవకాశం ఇవ్వలేదు. 23వ నిమిషంలో జుగరాజ్ సింగ్ పెనాల్టీ కార్నర్‌తో, 42వ నిమిషంలో హార్దిక్ సింగ్ పెనాల్టీ స్ట్రోక్‌తో గోల్స్ సాధించి భారత్‌కు 3–1 ఆధిక్యాన్ని అందించారు. చివరి క్వార్టర్‌లో మరింత దూకుడు పెంచిన భారత్, 54వ నిమిషంలో శిలానంద్ లక్రా ఫీల్డ్ గోల్, 57వ నిమిషంలో కెప్టెన్ హర్మన్‌ప్రీత్ సింగ్ మరో పెనాల్టీ కార్నర్ గోల్‌తో 5–1 తేడాతో భారీ విజయాన్ని ఖరారు చేశారు.

### చారిత్రాత్మక డబుల్ గోల్డ్

ఈ ఆసియా క్రీడలు భారత హాకీకి చిరస్మరణీయంగా నిలిచిపోతాయి. శుక్రవారం జరిగిన మహిళల ఫైనల్‌లో భారత జట్టు చైనాను 1–0 తేడాతో ఓడించి 44 ఏళ్ల నిరీక్షణకు తెరదించుతూ స్వర్ణం సాధించిన విషయం తెలిసిందే.

తాజాగా పురుషుల జట్టు కూడా స్వర్ణం గెలవడంతో, ఒకే ఆసియా క్రీడల్లో భారత పురుషుల, మహిళల హాకీ జట్లు రెండూ స్వర్ణ పతకాలు గెలవడం ఇదే తొలిసారి.

ఈ టోర్నీ ఆద్యంతం భారత్ అద్భుత ప్రదర్శన కనబరిచింది. హోరాహోరీగా సాగిన సెమీ ఫైనల్‌లో చిరకాల ప్రత్యర్థి పాకిస్థాన్‌పై ఆఖరి నిమిషంలో గోల్ చేసి 4–3 తేడాతో గెలిచి ఫైనల్‌కు దూసుకెళ్లింది. అంతకుముందు లీగ్ దశలో ఇండోనేషియా, శ్రీలంక, బంగ్లాదేశ్ వంటి జట్లపై భారీ గోల్స్ తేడా తో విజయాలు నమోదు చేసి తన సత్తా చాటింది. ఈ అద్భుత విజయంతో భారత హాకీ జట్టు ఆత్మవిశ్వాసంతో ఒలింపిక్స్‌కు సిద్ధమవుతోంది.

# ఆరంభంలో వెనుకంజ.. చివర్లో పతకాల పంజా!

# ఆసియా క్రీడల్లో భారత్ జోరు

రెండు రోజుల క్రితం పతకాల పట్టికలో భారత్ టాప్–10లో కూడా లేదు. తర్వాత పుంజుకొని టాప్–5లోకి దూసుకొచ్చింది. ఆరంభంలో ఆశించిన స్థాయిలో రాణించలేకపోయినా.. చివరి రెండు రోజుల్లో భారత క్రీడాకారులు అద్భుతాలు చేశారు. వరుసగా స్వర్ణాలు సాధిస్తూ పతకాల వేటలో కొత్త ఊపు తీసుకొచ్చారు. హాకీ, క్రికెట్ నుంచి ఆర్చరీ, బాక్సింగ్, రెజ్లింగ్ వరకు సత్తా చాటారు. మొత్తంగా 21 స్వర్ణాలు సహా 85 పతకాలతో ఆసియా క్రీడల ప్రస్థానాన్ని 4వ స్థానంతో ముగించారు. కొన్ని విభాగాల్లో నిరాశ ఎదురైనా.. మరికొన్ని క్రీడల్లో సరికొత్త చరిత్ర సృష్టించారు.



**చివర్లో ఒక్కసారిగా జోరు!**

ఆసియా క్రీడల్లో భారత్ ప్రస్థానం ఒడుదొడుకులతో సాగింది. గురువారం నాటికి ఖాతాలో 10 స్వర్ణాలు మాత్రమే ఉన్నాయి. పతకాల పట్టికలో టాప్–10 కింద నిలిచింది. అయితే చివరి రెండు రోజుల్లో సీన్ మారిపోయింది. క్రికెట్, హాకీ జట్లు పసిడి పతకాలు సాధించాయి. ఆర్చరీ, బాక్సింగ్, రెజ్లింగ్‌లోనూ భారత క్రీడాకారులు మెరిశారు. దీంతో చివరి రెండు రోజుల్లోనే మరో 11 స్వర్ణాలు ఖాతాలో చేరాయి. భారత్ టాప్–5లోకి దూసుకొచ్చింది.

**హాకీలో చరిత్ర.. క్రికెట్‌లోనూ పసిడి**

ఈసారి భారత హాకీ జట్లు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. మహిళల జట్టు 44 ఏళ్ల నిరీక్షణకు తెరదించుతూ స్వర్ణం గెలుచుకుంది. పురుషుల జట్టు కూడా మలేసియాపై 5–1తో ఘన విజయం సాధించి టైటిల్‌ను నిలబెట్టుకుంది. ఒకే ఆసియా క్రీడల్లో పురుషులు, మహిళల జట్లు స్వర్ణాలు గెలవడం ఇదే తొలిసారి. ఈ విజయాలతో రెండు జట్లూ 2028 లాస్‌ఏంజెల్స్ ఒలింపిక్స్‌కు నేరుగా అర్హత సాధించాయి. క్రికెట్‌లోనూ పురుషులు, మహిళలు స్వర్ణాలు గెలిచి భారత్ ఖాతాలో పసిడి పతకాలు జమ చేశారు. కబడ్డీలోనూ ఇరు జట్లు స్వర్ణ విజేతలుగా నిలిచాయి.

**ఆర్చరీలో అమ్మాయిల అదుర్స్!**

ఆర్చరీలో భారత క్రీడాకారులు అద్భుత ప్రదర్శన చేశారు. ఈ విభాగంలో ఐదు స్వర్ణాలు సహా మొత్తం 9 పతకాలు సాధించారు. మహిళల వ్యక్తిగత రికర్వ్‌లో 17 ఏళ్ల కుమ్‌కుమ్ స్వర్ణం గెలిచి చరిత్ర సృష్టించింది. ఆసియా క్రీడల్లో ఈ విభాగంలో స్వర్ణం సాధించిన తొలి భారత మహిళగా నిలిచింది. మహిళల రికర్వ్ జట్టు కూడా తొలిసారి పసిడి పతకాన్ని అందుకుంది. నీరు ధండా షూటింగ్‌లో మహిళల ట్రాప్ విభాగంలో స్వర్ణం గెలిచి ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంది. గోల్ఫ్‌లో ప్రణవి ఉర్స్ వ్యక్తిగత స్వర్ణంతో మెరిసింది.

**అథ్లెటిక్స్‌లో అత్యధిక పతకాలు**

భారత్‌కు అత్యధిక పతకాలు అందించింది అథ్లెటిక్సే. ఈ విభాగంలో 24 పతకాలు వచ్చాయి. ఒక స్వర్ణం, 9 రజతాలు, 14 కాంస్యాలు దక్కాయి. షూటింగ్‌లో 15, ఆర్చరీలో 9 పతకాలు లభించాయి. బాక్సింగ్, రెజ్లింగ్‌లో చెరో ఆరు పతకాలు వచ్చాయి. రెజ్లింగ్‌లో అమన్ శెహ్రావత్, సుజీత్ కల్కల్ స్వర్ణాలు సాధించగా.. లవ్లీనా బోర్గోహెయిన్, పర్వీన్ హూడా, అంకుశ్ పంఘాల్ బాక్సింగ్‌లో పసిడి పతకాలు గెలిచారు.

## ఆరంభంలో తడబడ్డా.. రాహుల్ సెంచరీతో భారత్ భారీ స్కోరు.. రోహిత్ శతకం మిస్



వెస్టిండీస్‌తో మూడో వన్డేలో ఆరంభంలో ఎదురైన ఎదురుదెబ్బల నుంచి కోలుకున్న భారత జట్టు భారీ స్కోరు చేసింది. కేఎల్ రాహుల్ సూపర్ సెంచరీతో చెలరేగాడు. రోహిత్ శర్మ, రుతురాజ్ గైక్వాడ్ కూడా రాణించడంతో భారత్ నిర్ణీత 50 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 351 పరుగులు చేసింది. తొలుత 4 పరుగులకే రెండు కీలక వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడిన జట్టును ఓపెనర్ రోహిత్, గైక్వాడ్ ఆదుకున్నారు. ఆ తర్వాత రాహుల్ తనదైన శైలిలో విరుచుకుపడ్డాడు. దీంతో విండీస్ ముందు 352 పరుగుల భారీ లక్ష్యం నిలిచింది. విండీస్ బౌలర్లు ఆరంభంలో భారత బ్యాటర్లను బాగా ఇబ్బంది పెట్టారు. పిచ్ నుంచి లభించిన సహకారంతో జేడెన్ సీల్స్ చెలరేగాడు. శుభ్‌మన్ గిల్ (1), విరాట్ కోహ్లీ (0)లను పెవిలియన్‌కు పంపి భారత్‌ను ఒత్తిడిలోకి నెట్టాడు. దీంతో భారత జట్టు 4 పరుగులకే రెండు కీలక వికెట్లు కోల్పోయింది.ఈ దశలో రోహిత్ శర్మ, రుతురాజ్ గైక్వాడ్ బాధ్యత తీసుకున్నారు. ఆరంభంలో ఆచితూచి ఆడిన ఈ జోడీ క్రమంగా వేగం పెంచింది. విండీస్ ఫీల్డర్లు గైక్వాడ్ ఇచ్చిన క్యాచ్‌లను వదిలేయడం అతడికి కలిసొచ్చింది. ఇద్దరూ అర్ధశతకాలు సాధించి మూడో వికెట్‌కు 137 పరుగులు జోడించారు. రోహిత్ 92 పరుగులు చేయగా.. గైక్వాడ్ 57 పరుగులతో రాణించాడు. నమన్ ధీర్ సైతం 30 పరుగులు చేసి భారత స్కోరును ముందుకు తీసుకెళ్లడంతో కీలక పాత్ర పోషించాడు.ఇక, కేఎల్ రాహుల్ ఇన్నింగ్స్‌ను తనదైన శైలిలో ముందుకు నడిపించాడు. విండీస్ బౌలర్లపై ఎదురుదాడికి దిగి పరుగుల వేగం పెంచాడు. కేవలం 80 బంతుల్లోనే శతకం పూర్తి చేసుకున్నాడు. చివరి వరకు క్రీజులో నిలిచి 129 పరుగులతో అజేయంగా నిలిచాడు. అతడి ఇన్నింగ్స్‌లో 10 ఫోర్లు, 6 సిక్సర్లు ఉన్నాయి. రాహుల్ మెరుపు ఇన్నింగ్స్‌తో భారత్ 350 పరుగుల మార్కును దాటి భారీ స్కోరు సాధించింది.



# కాంతార పార్ట్ 3.. కొత్త ప్రొడ్యూసర్ ఎంట్రీ తప్పదా?



కాంతార 3 ఎప్పుడొస్తుందా అని ఎదురుచూస్తున్న ఫ్యాన్స్ లో ఇప్పుడు మరో ఇంట్రెస్టింగ్ ప్రశ్న మొదలైంది. ఈసారి సినిమా కంటే నిర్మాత గురించే చర్చ జరుగుతోంది. రిషబ్ శెట్టి– హోంబలే ఫిల్మ్స్ కాంబోలో వచ్చిన రెండు చిత్రాలు భారీ విజయాలు సాధించిన నేపథ్యంలో.. మూడో పార్టు కోసం కొత్త ప్రొడ్యూసర్ రంగంలోకి దిగుతున్నారనే టాక్ ఇప్పుడు హాట్ టాపిక్ గా మారింది.

అయితే కాంతార ఫ్రాంచైజీ నుంచి మూడో సినిమా రావడం దాదాపు ఖాయమే. రిషబ్ శెట్టి ఇప్పటికే క్లారిటీ ఇచ్చారు. ప్రస్తుతం కథ, స్క్రిప్ట్ కు సంబంధించిన పనులు జరుగుతున్నాయి. కాంతార మొదటి సినిమా 2022లో వచ్చింది. చిన్న బడ్జెట్ తో తెరకెక్కిన ఈ సినిమా ఊహించని స్థాయిలో విజయం సాధించింది. రిషబ్ శెట్టి యాక్టింగ్, దర్శకత్వంతో పాటు కథ, దైవ విశ్వాసాల నేపథ్యం ప్రేక్షకులను బాగా ఆకట్టుకున్నాయి.ఆ విజయంతో కాంతార ఒక సినిమాగా కాకుండా పెద్ద ఫ్రాంచైజీగా మారింది. ఆ తర్వాత కాంతార: చాప్టర్ 1ను భారీ స్థాయిలో తెరకెక్కించారు. మొదటి సినిమాతో పోలిస్తే ఈసారి బడ్జెట్ కూడా పెరిగింది. అయినా బాక్సాఫీస్ దగ్గర సినిమాకు భారీ రెస్పాన్స్ వచ్చింది. ఇప్పుడు మూడో భాగంపై అంచనాలు మరింత పెరిగాయి. రిషబ్ శెట్టి కథను మరో స్థాయికి తీసుకెళ్లేలా ప్లాన్ చేస్తున్నట్లు తెలుస్తోంది. అయితే ఇక్కడే కొత్త చర్చ మొదలైంది.కాంతార మొదటి రెండు సినిమాలను నిర్మించిన హోంబాలే ఫిల్మ్స్ మూడో భాగంలో కూడా కొనసాగుతుందా లేదా అనే దానిపై క్లారిటీ లేదు. రిషబ్ శెట్టి మరో నిర్మాణ సంస్థతో కలిసి కాంతార 3 చేయబోతున్నారనే ఊహాగానాలు వినిపిస్తున్నాయి. ఆ చర్చకు ప్రధాన కారణం రిషబ్ శెట్టి, హోంబాలే ఫిల్మ్స్ కు సంబంధించిన కొన్ని సోషల్ మీడియా సిచ్యువేషన్స్. కాంతార యానివర్సరీ సందర్భంగా రిషబ్ శెట్టి సినిమా మెమోరీస్ షేర్ చేసుకున్నారు.అయితే ఆ పోస్టులో హోంబాలే ఫిల్మ్స్ ప్రస్తావన కనిపించలేదు. అటు హోంబాలే ఫిల్మ్స్ కూడా స్పెషల్ పోస్టు చేసింది. అందులో రిషబ్ శెట్టి ప్రస్తావన లేదు. దీంతో రిషబ్, హోంబలే మధ్య ఇంకా డిఫరెన్సెస్ పెరిగాయా అంటూ నెటిజన్లు డిస్కస్ చేసుకుంటున్నారు. గతంలో కూడా రిషబ్ శెట్టి హోంబలే ఫిల్మ్స్ ను సోషల్ మీడియాలో అన్‌ఫాలో చేశారంటూ వార్తలు వచ్చాయి. అలాగే క్రియేటివ్ డిఫరెన్సెస్, డబ్బు విషయంలో విభేదాలు ఉన్నాయంటూ కొన్ని ఊహాగానాలు వినిపించాయి.కానీ వాటిపై ఇప్పటి వరకు ఎవరూ రెస్పాండ్ అవ్వలేదు. అందుకే ప్రస్తుతం కాంతార 3కి కొత్త నిర్మాత వస్తున్నారని చెప్పడం కంటే.. కొత్త నిర్మాత వచ్చే అవకాశం ఉందనే చర్చ మాత్రమే నడుస్తోందని చెప్పాలి. మరి కాంతార 3 నిర్మాణం విషయంలో చివరకు ఏ నిర్ణయం తీసుకుంటారనేది చూడాలి. హోంబలే ఫిల్మ్స్ కంటిన్యూ అవుతుందా, లేక కొత్త నిర్మాణ సంస్థ వస్తుందా అనే దానిపై అఫీషియల్ అనౌన్స్మెంట్ వచ్చిన తర్వాతే క్లారిటీ వచ్చే అవకాశం ఉంది.



Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, ONGOLE MANDAL, prakasam district, Andhrapradesh-523001. and published at D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, ONGOLE MANDAL, prakasam district, Andhrapradesh-523001. Editor: GANTYADA APPARAO. Mobile : 9059465965, RNI : APTEL/25/A2230, editorpenpower@gmail.com